# వార్తపత్రిక

జాతీయ తెలుగు దినపత్రిక

vaarthapatrika.com / epaper.vaarthapatrika.com

TS-02-0297488

vaarthapatrika.com



## విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను అక్షర రూపం దాల్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే వార్తపత్రిక జాతీయదినపత్రిక స్వాగతం పలుకుతుంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వార్తపత్రికలో, జిల్లాల బ్యూరోలు, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లా, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 9490617567



ఎడిటర్ : మరే చిన్నబాబు తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 14 మంగళవారం , ఫిబ్రవరి 10 , 2026 , పేజీలు -08 వెల : 2 /-


## రెండేళ్ల అభివృద్ధిని చూసి
# ఓటేయండి

పట్టణాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యం

12 ఏళ్ల బిజెపి పాలన, పదేళ్ల బిఆర్ఎస్ పాలన చూడండి

రాష్ట్రంలో అనేక పథకాలతో అభివృద్ధి, సంక్షేమాన్ని చేపట్టాం

మోడీకి మున్సిపల్ ఎన్నికలకు సంబంధం ఏమిటో

తెలంగాణ రూపాయి ఇస్తే..42 పైసలే వాపస్ వస్తున్నాయి

ఉత్తరాది బీహార్, యూపిలతో పోలిస్తే దారుణమైన పరిస్థితి

దక్షిణాది రాష్ట్రాలపై కక్షగట్టిన ప్రధాని మోడీ

దక్షిణాది సొమ్ముతో ఉత్తరాది రాష్ట్రాలకు సోకు

ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నట్లు

మీడియా సమావేశంలో గణాంకాలతో వెల్లడించిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఫిబ్రవరి 9:**మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు ఓటేయాలని, దీంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన, 12 ఏళ్ల మోడీ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుని అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన వేళ సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలకు మోడీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మోడీ ముఖం చూసి ఓటేయమని బిజెపి అడగడాన్ని ఎద్దేవా చేశారు. బిజెపి అధ్యక్షుడు ప్రచారంలో మిగతా2లో...

# సర్ ప్రక్రియను అడ్డుకోవద్దు

● బెంగాల్ సర్ ప్రక్రియపై సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 9 :** బెంగాల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సోమవారంనాడు కీలక వ్యాఖ్యలు చేసింది. 'సర్' పక్రియకు అడ్డంకులు కల్పించే ఎలాంటి ప్రయత్నాలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. ఏదైనా బెటర్‌మెంట్ చేయాల్సిన అవసరం వచ్చినట్లయితే తామే కల్పించుకుంటామని తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో 'సర్' పక్రియను మిగతా2లో...

# స్పీకర్ తీరుపై విపక్షాల ఆగరహం

అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టే యోచన

ఖర్గేతో వివిధ పక్షాల నేతల భేటీలో చర్చ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 9 :**పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంతో ఇటు అధికార పక్ష సభ్యులు, అటు విపక్ష సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గందరగోళ పరిస్థితుల మధ్య ఉభయసభల కార్యకలాపాలకు తరచు అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడేందుకు అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో విపక్షాలు ఉన్నట్టు విశ్వసనీయ మిగతా2లో...

## మధిరను రోల్ మోడల్‌గా
# తీర్చిదిద్దుతా...

● రాజకీయాలు కాదు..అభివృద్ధి ముఖ్యం

● ఎన్నికల ప్రచార సభలో డిప్యూటి సిఎం భట్టి




**ఖమ్మం,ఫిబ్రవరి 9 :** మధిర పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చే బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిరలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ తరహాలో మోడరన్ మహాప్రస్థానం శ్మశానవాటిక నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నా మని తెలిపారు. మధిరకు కావాల్సింది రాజకీయాలు కాదని, కేవలం అభివృద్ధి మాత్రమేనని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలోని మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భట్టి విక్రమార్క భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. మిగతా2లో...

## పదేళ్లలో చేయని అభివృద్ధి
# ఇప్పుడెలా చేస్తారు

- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా మద్దతు మాకే
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా



**ఖమ్మం,ఫిబ్రవరి 9 :**రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేనోళ్లు.. ఇప్పుడెట్ల అభివృద్ధి చేస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు, అధికారంలో ఉన్నప్పుడు దొర పోకడ తప్ప పేదోల కష్టాలు తెలు సుకో లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ప్రజాప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని అన్నారు. పంచాయితీల్లో మద్దుత తెలిపనట్లే మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రాజమద్దతు మిగతా2లో...




## 11న మున్సిపల్
# పరిధిలో సెలవు

**హైదరాబాద్,ఫిబ్రవరి 9 :** ఈ నెల11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఎన్నికలు జరిగే కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో పనిచేసే ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు ఈ నెల 11న స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ ఎన్నికల సంఘం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కోసం వినియోగిస్తున్న విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలు, ఇతర పబ్లిక్ బిల్డింగ్స్ అన్నింటికీ 10, 11 న స్థానిక సెలవు దినంగా ప్రకటించారు. ఓట్ల లెక్కింపులో భాగంగా ఈ నెల 11 నుండి 13 వరకు సెలవులు ప్రకటిస్తూ జారీ చేశారు.

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల
# ప్రచారపర్వం

● 116 మున్సిపాలిటీలు ,7 మున్సిపల్ కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం ● 11న పోలింగ్‌కు ఎన్నికల సంఘం సర్వం ఏర్పాట్లు




**హైదరాబాద్,ఫిబ్రవరి 9 :** తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రచార పర్వం ముగిసింది. చివరిరోజు ఉధృతంగా ప్రచారం సాగింది. కాంగ్రెస్ నుంచి మంత్రులు తమ ప్రాంతా ల్లో ప్రచారం నిర్వహించారు. బిజెపి, బిఆర్ఎస్ నేతలు కూడా ప్రచా రంలో దూసుకుపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ సత్తా నిరూపించుకునేందుకు ఈ ఎన్ని కలను సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్నా యి. అగ్రనేతల పర్యటనలు, రోడ్ షోలు, ఇం టింటి ప్రచారంతో ఇన్నాళ్లూ మార్మోగిన వీధు లన్నీ ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. మిగతా2లో...

## రెండేళ్ల తరవాత మళ్లీ
# అధికారం మాదే...

● పాలన చేతకాక...హామీలను అటకెక్కించారు

● హామీల అమలుకు నిలదీస్తూనే ఉంటాం

● భూపాలపల్లి ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



**జయశంకర్ భూపాలపల్లి,ఫిబ్రవరి 9 :** రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.రెండేళ్ల తర్వాత ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని హెచ్చరించారు. మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు భూపాలపల్లిలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మిగతా2లో...

## రెండేళ్ల పాలనలో కాంగ్రెస్
# చేసింది శూన్యం

420 హామీలు ఇచ్చి ఒక్క హామీనీ అమలు చేయలేదు

మెదక్ పర్యటన అంటూనే వణుకుతున్న రేవంత్

దుబ్బాక ప్రచారంలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట,ఫిబ్రవరి 9 :** రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే విమర్శించారు. 420 హామీలు ఇచ్చి ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. మెదక్ రావాలంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని హరీశ్‌రావు అన్నారు. అన్ని జిల్లాలు తిరుగుతున్న రేవంత్ రెడ్డి ఉమ్మడి మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదని విమర్శించారు.ఇక్కడ హరీశ్‌రావు ఉన్నాడని భయపడుతున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇచ్చారు.. కానీ రేవంత్ పాలన అంత తుస్సే అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మిగతా2లో...



# రెండేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నా రాష్ట్రానికి ఒక్క పైసా ఉపయోగం లేదన్నారు. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తూ భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి దక్కాల్సిన వాటాలో తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తూ ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్రం పెద్దపీట వేస్తోందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా పన్నుల పునఃపంపిణీలో కేంద్రం అనుసరిస్తున్న తీరును ఆయన గణాంకాలతో సహా ఎండగట్టారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్తున్న ప్రతి రూపాయికి ప్రతిఫలంగా రాష్ట్రానికి కేవలం 42 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని, ఇది రాష్ట్ర ప్రయోజనాలపై గొడ్డలి పెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర పన్నుల వాటా పంపిణీలో ఉత్తరాది రాష్ట్రాలకు అందుతున్న నిధులపై సీఎం రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రానికి నుంచి నిధులను సేకరించి, ఇతర రాష్ట్రాలకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. ఉత్తరప్రదేశ్ రూపాయి పన్ను చెల్లిస్తే కేంద్రం ఆ రాష్ట్రానికి 2 రూపాయలు తిరిగి ఇస్తోందని, ఇక బీహార్ విషయానికొస్తే రూపాయికి బదులుగా ఏకంగా 6 రూపాయలు నిధులుగా వెళ్తున్నాయని ఆయన వివరించారు. ఈ స్థాయి వివక్షపై తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా పార్లమెంట్‌లో నోరు మెదిపారా అని ఆయన నిలదీశారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపించినందుకు తెలంగాణకు మీరు చేసిన మేలేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పైకి విమర్శలు చేసుకుంటున్నప్పటికీ, లోపల మాత్రం ఆ రెండు పార్టీలు ఒక్కటేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన వివాదాస్పద రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ బేషరతుగా మద్దతు తెలిపిందని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా, నోట్ల రద్దు సమయంలో కేసీఆర్ అసెంబ్లీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మరీ ప్రధాని మోదీని అభినందించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. మోదీ ప్రేమలో అమరత్వం పొందుతానని గతంలో కేసీఆర్ చెప్పలేదా అని ఆయన ఎద్దేవా చేశారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్లుగా వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం బయటపడదని అనుకుంటున్నారని, కానీ బీఆర్ఎస్ , బీజేపీ మధ్య పక్కాగా 'క్విడ్ ప్రో కో' ఒప్పందం నడుస్తోందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

అత్యంత ఖరీదైన ఫార్ములా-ఈ కారు రేస్ అక్రమాలకు సంబంధించిన ఫైల్స్ ఈడీ వద్ద ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేసినా కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటని అడిగారు. బీఆర్ఎస్ నాయకులను కాపాడేందుకే బీజేపీ ఈ కేసులను అటకెక్కించిందని రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం తన ప్రభుత్వం పోరాటం కొనసాగిస్తుందని, కేంద్రం నుంచి రావాల్సిన ప్రతి పైసాను సాధించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# సర్ ప్రక్రియను అడ్డుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఫిబ్రవరి 14 నుంచి 21వ తేదీ వరకూ మరో వారం పొడిగిస్తున్నట్టు పేర్కొంది. ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే మేమే జారీ చేస్తాం. అంతేకానీ సర్ పక్రియను అడ్డుకోవడాన్ని మాత్రం అనుమతించం. అన్ని రాష్ట్రాలు దీన్ని అర్థం చేసుకోవాలి' అని సీజేఐ సూర్యకాంత్ స్పష్టం చేశారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ పక్రియను సవాలు చేస్తూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు తాజా వ్యాఖ్యలు చేసింది. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఎస్ఐఆర్ పక్రియలో 8,500 మంది ఆఫీసర్లు పాల్గొంటున్నట్టు విచారణ సందర్భంగా సీజేఐ పేర్కొన్నారు. ఈ పని ముందే చేసి ఉంటే తాము ఆమోదించి ఉండేవాళ్లమన్నారు. మైక్రో-అబ్జర్వర్ల స్థానంలో ఉపయోగించుకుంటున్న 8,000 మంది గ్రూప్-బి అధికారుల పేర్లు పంపడంలో ఎందుకు జాప్యం జరిగిందని బెంగాల్ ప్రభుత్వాన్ని సీజేఐ ప్రశ్నించారు. ఫిబ్రవరి 4న తాము ఆదేశాలిస్తే ఫిబ్రవరి 7వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకూ ఎందుకు పంపించలేదని మమతాబెనర్జీని ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తన వాదన వినిపిస్తూ, ఎన్నికల కమిషన్ ఎప్పుడూ బి-గ్రూప్ ఆఫీసర్లను అడగలేదని, అలాంటి రిక్వెస్ట్ కూడా ఎప్పుడూ చేయలేదని చెప్పారు. ఓటర్ల స్థానికతను నిరూపించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇవ్వడం లేదని బెంగాల్ ప్రభుత్వ న్యాయస్థానం దృష్టికి తెచ్చింది. దీంతో డాక్యుమెంట్ల వెరిఫికేషన్, ఎన్నికల తుది జాబితా గడువును మరో వారం రోజుల పాటు ఫిబ్రవరి 21 వరకూ పొడిగిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది.

# స్పీకర్ తీరుపై విపక్షాల ఆగరహాం

(మొదటి పేజీ తరువాయి)

వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చినట్టు చెబుతున్నారు. విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆప్రకారం బడ్జెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బడ్జెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13తో ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2 వరకూ జరుగుతాయి. కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్పీ) తదితరల పార్టీల ఎంపీలు ఈ సమావేశంలో పాల్గొన్నట్టు సమాచారం. మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై దాడికి సిద్ధమయ్యామంటూ తమపై అసత్య ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఖండించారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా తాము నిరసన తెలిపామని, హింసకు దిగాలని తాము అనుకోలేదని, విపక్షాలను ఎదుర్కొనే ధైర్యం ప్రధానికి లేకపోవడం వల్లే భయపడి సభకు రాలేదని మహిళా ఎంపీలు ఆ లేఖలో పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్ నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. ఎంపిక చేసి మరీ 8 మంది విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేశారని, మాజీ ప్రధానులపై బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ జోతిమణి, పలువురు మహిళా ఎంపీలు ఈ లేఖపై సంతకాలు చేశారు.

# పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడెలా చేస్తారు

(మొదటి పేజీ తరువాయి)

తమకు ఉందన్నారు. చివరి రోజు ఆయన సుగిగాలి పర్యటనలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ వరి వేస్తే ఉరేనని చెప్పారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్నబియ్యం పండించే రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ డబ్బులు కూడా చెల్లిస్తున్నామన్నారు. 'ప్రస్తుతం ఉన్నది దొరల పాలన కాదు.. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమ ప్రభుత్వం' అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వకుండా కమీషన్ల కోసం రూ. లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారని విమర్శించారు. మొదట విడతగా రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని, ఏప్రిల్‌లో రెండో విడతతో పాటు మరో మూడు విడతల్లో ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. గత సర్కార్ మూతపడ్డ కోళ్లఫామ్స్, రైస్‌మిల్లుల్లో హాస్టళ్లు ఏర్పాటు చేస్తే.. తమ ప్రభుత్వం మాత్రం రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తోందన్నారు.

# అక్రిడిటేషన్ కోసం దరఖాస్తులు ఆహ్వానం..

**సిద్దిపేట,ఫిబ్రవరి 9:**

2026-28 కి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్ లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ హైమావతి తెలిపారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను డీపీఆర్వో ఆఫీస్ లో సమర్పించాలన్నారు. యాజమాన్యాల ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ ద్వారా ఈనెల 9 నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ చేసింది శూన్యం

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపాలిటీలో హరీశ్‌రావు పర్యటించారు. చెల్లాపూర్ వార్డులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణను తెచ్చిన కేసీఆర్‌ను రేవంత్ తిడుతున్నాడని హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చి అభివృద్ధి పథకాలు అమలు చేయడం కేసీఆర్ తప్పా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిడితే ఓట్లు రావని.. పథకాలు అమలు చేస్తే వస్తాయని హితవుపలికారు. బూతులు మాట్లాడే రేవంత్‌కు పోలింగ్ బూత్‌లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పంద్రాగస్టుకల్లా రుణమాఫీ పూర్తి చేస్తానని దేవుళ్లపై రేవంత్ రెడ్డి ఒట్లు పెట్టిండని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్యారంటీలు, గారడీలపై మెదక్ ప్రజలు నిలదీస్తారని ఇటువైపు చూడటం లేదని పేర్కొన్నారు. మెదక్‌లో రేవంత్ రెడ్డి ఒక్క వార్డులో కూడా గెలవడని తెలిపారు. రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ లేదు కానీ.. స్కామ్ క్యాలెండర్ అయితే ఇచ్చిండని విమర్శించారు. ప్రతి నెల ఏదో ఒక కుంభకోణం తెరపైకి తీసుకొచ్చాడని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి సురుకుపెట్టాలని అన్నారు. దుబ్బాక ఓటర్ల దెబ్బకు రేవంత్ రెడ్డికి దిమ్మ తిరగాలని అన్నారు. అలా కాకుండా కాంగ్రెస్‌కే ఓటేస్తే.. పథకాలు ఎగబెట్టినా నాకే ఓట్లు వేశారని రేవంత్ రెడ్డి అంటారని తెలిపారు. దుబ్బాకలో కాంగ్రెస్ ఏదైనా అభివృద్ధి చేస్తే చూపించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులు పంచి గెలవాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన పథకాలు, అభివృద్ధితో పోలిస్తే ఈ డబ్బులు ఎంత అని ప్రశ్నించారు. రెండేళ్లలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. దుబ్బాకను ఇంకా అభివృద్ధి చేసే బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి నోరు విప్పితే బూతు లు తప్ప మంచిమాట రాదని అన్నారు. కేసీఆర్ హయాంలో భూముల విలువ పెరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు తగ్గడమే కాదు.. తెలంగాణ ప్రతిష్ట కూడా దిగజారిందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి చేతిలో మోసపోని మనిషే లేడని పేర్కొన్నారు. హామీలు, గ్యారంటీల పేరుతో మోసం చేసి కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. తెలంగాణ భవిష్యత్ గురించి ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు.

# ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగాలి

- ప్రతి ఒక్కరూ ఓటేసాలా చూసుకోవాలి
- పార్టీ నేతలకు సిఎం రేవంత్ దిశానిర్దేశం



**హైదరాబాద్,ఫిబ్రవరి 9 :** మున్సిపల్ ఎన్నికల్లో నేతలు సమన్వయంతో ముందుకెళ్లాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలపై కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులతో సీఎం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై సీఎం రేవంత్ ఆరా తీశారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో పోలింగ్ వ్యూహంపై చర్చించారు. స్థానిక నేతల నేతృత్వంలో పోల్ మేనేజ్‌మెంట్ జరిగేలా చూడాలని మంత్రులకు సూచించారు. ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. ఇవాళ, రేపు ఓటర్లకు నేతలు అందుబాటులో ఉండాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు.ప్రతి ఓటరు బూత్ దగ్గరకు చేరుకునేలా చూడాలన్నారు. ఏమరుపాటు పనికిరాదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటేసాల చూడాలన్నారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం

(మొదటి పేజీ తరువాయి)

ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో ఓటర్ల బలం గణనీయంగా ఉంది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి మొత్తం 52,43,023 మంది ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఇందులో పురుష ఓటర్ల సంఖ్య 25,62,639 కాగా, 26,80,014 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఈ ఎన్నికల్లో కీలక పరిణామంగా కనిపిస్తోంది. వీరితో పాటు మరో 640 మంది ఇతర ఓటర్లు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,195 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల కోసం 16,031 బ్యాలెట్ బాక్సలను సిద్ధం చేశారు. పోలింగ్ పక్రియను పర్యవేక్షించేందుకు 1,379 మంది రిటర్నింగ్ ఆఫీసర్లు (ఖీక్ష), 1,547 మంది సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. క్షేత్రస్థాయిలో 9,560 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు (ఖక్ష), 31,428 మంది ఇతర సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సలను భద్రపరచడానికి 137 స్టాం÷-రగ్ రూమ్‌లు, ఫలితాల లెక్కింపు కోసం 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం భారీ భద్రతను ఏర్పాటు చేసింది. సుమారు 25,000 మంది పోలీసు సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెంచారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు. ఎన్నికల పక్రియలో పూర్తి పారదర్శకతను పాటించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించారు. దీని ద్వారా ఎన్నికల సంఘం అధికారులు నేరుగా పోలింగ్ సరళిని పర్యవేక్షించవచ్చు. మొత్తం 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో చూడాలి.ఫిబ్రవరి 11న పోలింగ్ ముగిసిన తర్వాత, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఆ తర్వాత 14న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూ టీ మేయర్లతో పాటు మున్సిపల్ చైర్మన్ , డిప్యూటీ చైర్మన్ల ఎన్నిక పక్రియ జరుగుతుంది. చివరగా ఫిబ్రవరి 16న కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకా రం, ప్ర త్యేకసమావేశంతోఈ ఎన్నికల పక్రియ పూర్తి కానుంది.

# ముగిసిన జిహెచ్ఎంసి పదవీకాలం

- మేయర్ విజయలక్ష్మికి సన్మానం




**హైదరాబాద్,ఫిబ్రవరి9 :** నగర కార్పొరేటర్లు, అధికారుల సమష్టి కృషితో ఐదేళ్లలో నగరాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. తన పదవి కాలంలో కమిషనర్, అధికారులు అందించిన సహకారాన్ని మరువలేనని చెప్పారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ చివరి సమావేశం నిర్వహించారు. ఎజెండా అంశాల్లోని 9 ప్రతిపాదనలకు, 11 అదనపు అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇటీవల అహ్మదాబాద్, రాజ్‌కోట్ పురపాలక సంఘాల్లో మేయర్ ఆధ్వర్యంలో పర్యటించిన కార్పొరేటర్ల బృందం.. అక్కడ గుర్తించిన ఉత్తమ విధానాలతో కూడిన సమగ్ర అధ్యయన నివేదికను కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు అందజేసింది. స్టాండింగ్ కమిటీ ఆమోదించిన పనులు పూర్తి చేస్తామని కర్ణన్ తెలిపారు. కార్పొరేటర్లు లేవనెత్తిన ప్రజా సమస్యలను చాలా వరకు పరిష్కరించామని వెల్లడించారు. ఈ సందర్భంగా మేయర్ పదవీకాలం పూర్తి కావడంతో విజయలక్ష్మిని ఆమె ఛాంబర్‌లో సన్మానించారు.

# రెండేళ్ల తరవాత మళ్లీ అధికారం మాదే...

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. హామీలు అమలు చేయాలని బరాబర్ అడుగుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ వెంటపడుతూనే ఉంటామని తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే కల్యాణలక్ష్మి డబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని అబద్దాలు చెప్పిండని అన్నారు. కానీ ఇప్పుడు మొఖం బాగోలేక అద్దం పగులగొట్టినట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్‌లోనే రైతుబంధు పడేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ తెలిపారు. నువ్వు పెట్టినవా తీసేయడానికి.. రెండేళ్లలో ఈ పొట్టోడు ఏం పీకిండని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే నీ వీపు చింతపండు చేస్తారని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాను తెచ్చింది అభివృద్ధి చేసింది కేసీఆర్ అని తెలిపారు. సింగరేణి కాంట్రాక్టులను రేవంత్ రెడ్డి తన బామ్మర్దికి కట్టబెట్టిండని పేర్కొన్నారు. బొగ్గు కుంభకోణం బయటపెట్టామని ఫేక్ నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఓటుకు నోటు కేసులో ఆధారాలు ఉండకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిప్పు పెట్టి తగులబెట్టారని మండిపడ్డారు. తెలంగాణను ఆగం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని గల్లా పట్టుకుని అడగండని ఓటర్లకు పిలుపునిచ్చారు. తులం బంగారం ఎప్పుడి స్తావని అడగాలన్నారు. రేవంత్ రెడ్డికి ఓటుతోనే కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. బూతుల ముఖ్య మంత్రికి పోలింగ్ బూత్‌లోనే బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అన్ని వార్డుల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఇదిలావుంటే అసలు కాంగ్రెస్ వాళ్లు మసకబడితే నకిలీ తెలుగుదేశపోడు ముఖ్యమంత్రి అయ్యిండని రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లిలో కేటీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో అసలైన కార్యకర్తలు, నాయకులకు విలువ లేదన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ వాళ్ల మీద పెత్తనం చేసుకో అంతే కానీ కేసీఆర్‌ను ఒక్క మాటంటే బిడ్డా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు.

# మధిరను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా...

(మొదటి పేజీ తరువాయి)


ఆయన మధిర పట్టణ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత 10 సంవత్సరాలుగా మధిర మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మధిర మున్సిపాలిటీలోని అన్ని వార్డులను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థుల గెలుపు రాజకీయాల కోసం కాదని.. అభివృద్ధి కోసమే అని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్-టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డబ్బు ప్రధానం కాదని.. అభివృద్ధే ప్రధానమని, వ్యక్తులకన్నా వ్యవస్థలే ముఖ్యమని డిప్యూటీ సీఎం వివరించారు. మధిర మున్సిపాలిటీని రాష్ట్రానికి మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ఏ అవసరం ఉన్నా ప్రజలందరికీ అండగా నిలుస్తానని చెప్పారు. విజ్ఞులైన ప్రతి ఒక్కరూ మధిర అభివృద్ధిపై తమ ఆలోచనలు పంచుకోవాలని కోరారు. మహిళలను వడ్డీలేని రుణాలతో స్వయం ఉపాధి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# లక్ష్మీదేవుని పల్లి గుడుల అభివృద్ధికి విభిన్న దాతల విశేష సహకారం




**వార్త పత్రిక షాద్ నగర్ ఫిబ్రవరి09:**లక్ష్మీదేవుని పల్లి గ్రామంలోని గుడుల అభివృద్ధి, ప్రతిష్ఠాపన కార్యక్రమాల నేపథ్యంలో పలువురు దాతలు ముందుకు వచ్చి విలువైన విరాళాలు, నిర్మాణ సామగ్రిని అందజేశారు.గుడికి రామాలయానికి సంబంధించిన విరాళాలు: నాగులపల్లి శివ కుమార్ గౌడ్ రామాలయం ఉత్సవ విగ్రహాలు కల్లెపు ఉషయ్య నాగపవ, హుండీ విరాళం మురళీకృష్ణ ఉపాధ్యాయుడు హనుమాన్ గుడికి గోపురం శివాలయం, పోశమ్మ గుడుల అభివృద్ధికి కల్లెపు వెంకటయ్య శివాలయం గోపురం పసుపుల నర్సింలు (మాజీ సర్పంచ్) పోశమ్మ గుడి గోపురం తీసుకురావడం జరిగింది ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ "గ్రామంలోని ప్రతి గుడి అభివృద్ధికి దాతలు ఐక్యంగా ముందుకు రావడంష్ట్ర గర్వకారణం. ఈ సేవలు భవిష్యత్ తరాలకు శాశ్వతంగా నిలిచిపోతాయి" అని తెలిపారు. లక్ష్మీదేవుని పల్లి గ్రామంలోని గుడుల అభివృద్ధికి సహకరించిన ప్రతి దాతకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల తరపున కూన శ్రీశైలం గౌడ్ ప్రచారం



**వార్తపత్రిక, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 9:**మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా నియమితులైన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారం ఎన్నికల చివరి రోజు సందర్భంగా మున్సిపల్ పరిధిలోని 4వ, 5వ, 13వ, 15వ, 16వ, 18వ మరియు 19వ వార్డులలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు మహమ్మద్ షరీఫ్, సారిక శ్రీనివాస్ రెడ్డి, సంతోష సత్తయ్య, నక్క సంతోష రాములు, సత్యలక్ష్మి యాదగిరి, సయ్యద్ మతిన్, మున్వర్ ఆలీ కు మద్దతుగా గడపగడపకు ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచారంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి పాల్గొని, పలు వార్డులలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్లలో ప్రసంగించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిజంగా ప్రజల వరకు చేరాలంటే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్యే, ఎంపీ ప్రచారం




**వార్తపత్రిక, జోగులాంబ గద్వాల జిల్లా, ఫిబ్రవరి 9:**జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని 19వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నర్సింహులు యాదవ్ ఎన్నికల ప్రచారంలో డిసిసి అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, గద్వాల్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, నాగర్ కర్నూల్ లోక్‌సభ సభ్యులు మల్లు రవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఖాళీ స్థలం ఉన్న పేదలకు ఐదు లక్షల రూపాయల సహాయం వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేశారు. ఈ పథకాలు సామాన్య ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకొచ్చాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నర్సింహులు యాదవ్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో
ప్రజలకు చేరవేస్తామని హామీ ఇచ్చా రు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# పాడిచన్ పల్లి హై స్కూల్ ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వయంపాలన దినోత్సవం



**పాపన్నపేట, ఫిబ్రవరి 09) (వార్తాపత్రిక ప్రతినిధి :** పాపన్నపేట మండలంలోని పొడిచన్ పల్లి హైస్కూల్లో సోమవారం స్వయంపాలన దినోత్సవం ను ఘనంగా నిర్వహి ంచారు .ప్రధానోపాధ్యాయురాలిగా కీర్తన,ఎం ఈఓ గా తేజస్విని, డిప్యూటీ డి ఈ ఓ గా పరమేశ్వర్,డిఈ ఓగా సాయి చరణ్ గౌడ్,కలెక్టర్ గా పావని ఉపాధ్యాయులుగా పి ఈటీలు గా విద్యార్థులు వ్యవహరించారు.విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి వారికి పాఠాలు భోదించారు. పాఠశాల లో తమకు ఈరోజు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు.భవిష్యత్ లో ఉన్నత స్థానాలలో తాము ఉంటామని తెలిపారు.ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఇంచార్జి ఎం ఈ ఓ ఎ.ప్రతాపరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్,మాధవరెడ్డి,కె.కిషన్,పి. భద్రయ్య,జి.భవానీప్రసాద్, డి. గన్ను,సుబ్బారావు, శివశంకర్,శివలింగం గౌడ్, చంద్రకాంత్,డాక్టర్ బి. దేవయ్య,శశికళ పిడి. మహిపాల్ ,పాషా లు బహుమతులు అందించారు.

# సరూర్‌నగర్ స్టేడియంలో 5 అంతర్జాతీయ స్థాయి కుంపు కరాటే టైక్వాండో పోటీలు

- అహ్మద్ ఖాన్ మాస్టర్ శిక్షణలో మెరిసిన శిష్యులు
- షాద్ నగర్ న్యూ పవర్ కుంపు కరాటే అకాడమీకి 19 బంగారు పతకాలు





**వార్త పత్రిక షాద్ నగర్ ఫిబ్రవరి09:**సరూర్‌నగర్ స్టేడియం వేదికగా ఎన్ డి ఎఫ్ ఎం ఏ ఏ ఫౌండేషన్ ప్రెసిడెంట్ పీవీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన 5 వ ఇంటర్నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కరాటే ఽ కుంపు--టైక్వాండో ఛాంపియన్షిప్ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ అంతర్జాతీయ స్థాయి పోటీలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చిన సుమారు 2,000 మంది విద్యార్థులు పాల్గొని కరాటే, కుంపు, టైక్వాండో విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు.శారీరక దృఢత్వం, మానసిక క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ పోటీలు క్రీడాభిమానులను ఆకట్టుకున్నాయి.ఈ పోటీల్లో షాద్‌నగర్ న్యూ పవర్ అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.మాస్టర్ అహ్మద్ ఖాన్ (బ్రూస్లీ) శిక్షణలో తయారైన 19 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని, అందరూ ప్రథమ స్థానంలో నిలిచి అత్యుత్తమ బంగారు పతకాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో న్యూ పవర్ అకాడమీ విద్యార్థులు సాధించిన విజయం షాద్‌నగర్‌కు గర్వకారణంగా నిలిచింది.శిష్యుల విజయం వెనుక గురువుల కఠిన శిక్షణ, క్రమశిక్షణతో కూడిన సాధన, నిరంతర ప్రోత్సాహమే ప్రధాన కారణమని క్రీడా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.ఈ సందర్భంగా మాస్టర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ... మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల్లో కేవలం శక్తినే కాదు, ఆత్మవిశ్వాసం, స్వీయ నియంత్రణ, జీవన విలువలను పెంపొందిస్తాయి.నా విద్యార్థులు సాధించిన ఈ విజయం అందరికీ ప్రేరణగా నిలుస్తుం దన్నారు. న్యూ పవర్ అకాడమీ విద్యార్థుల ఈ ఘన విజయంతో షాద్‌నగర్ పేరు అంతర్జాతీయ స్థాయిలో అందుకోవడంతో ప్రముకులు అభినందించి శాలువాతో పూల మాలలతో ఘనంగా సత్కరించారు. కుంపు విభాగంలో ఉత్తమ ప్రతిభ చాటిన వారు హర్షిత్, ప్రేమ్ కుమార్, నిత్విక్, చెర్రీ, లక్కీ అజ్మ, జన్యన , ఈషిక, గణేష్, కమల్ దత్తు, జితేందర్, విగ్నేష్, గౌతమ్ వీరందరూ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు అందుకున్నారు.

# గోల్డ్ మెడలిస్ట్‌కు అండగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



**వార్తపత్రిక, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 9:** ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు ఆటంకం ఎదుర్కొంటున్న మైక్రోబయాలజీ గోల్డ్ మెడలిస్ట్‌కు బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అండగా నిలిచారు.మైక్రోబయాలజీ డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించిన పేద విద్యార్థి శ్రీపతి ఉదయ్ కుమార్‌కు ఆస్ట్రేలియాలోని (ఆర్ఎమ్ఐటి) యూనివర్సిటీలో మైక్రోబయాలజీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుకునే అవకాశం లభించింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు ఆటంకం ఏర్పడడంతో, స్థానిక శాసనసభ్యులు బీఆర్ఎస్ ఎల్పీ విప్ కె.పి. వివేకానంద్ ని విద్యార్థి సహాయం కోసం ఆశ్రయించాడు.
విద్యార్థి అభ్యర్థనకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ సభ్యులకు విషయం తెలియజేయగా, ఎమ్మెల్యే సిఫారసుకు స్పందించిన లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం ఉదయం రూ.1,30,000 ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మాట్లాడుతూ, తాను సిఫారసు చేసిన మూడు రోజులలోనే విద్యార్థికి అండగా నిలవడం ఎంతో అభినందనీయమని లయన్స్ క్లబ్ సభ్యులను ప్రశంసించారు. భవిష్యత్తులోనూ పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఇలాంటి సహకారం కొనసాగించాలని కోరారు. నియోజకవర్గంలో పేద విద్యార్థులు వైద్య, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యను పూర్తి చేసుకునేందుకు తన వంతుగా ఎల్లప్పుడూ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు ఆంజనేయులు, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ విజయ్ కుమార్ శెట్టి, సీనియర్ సభ్యులు చల్లా శ్రీనివాస రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, కోలా వెంకటేష్, ముదిరాజ్ శ్రీనివాస్ రెడ్డి, నరసింహులు గౌడ్, బాలరాజు, ప్రవీణ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ పూర్తి : జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**వార్తాపత్రిక: భద్రాద్రి కొత్తగూడెం :**ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమయ్ కుమార్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి తదితర అధికారుల సమక్షంలో ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో నిర్వహించనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి మరియు ముగ్గురు ఓపిఓలు చొప్పున ఎన్నికల సిబ్బందిని, అదనంగా 20 శాతం రిజర్వు సిబ్బందిని రాండమైజేషన్ విధానం ద్వారా కేటాయించినట్లు తెలిపారు. అశ్వారావుపేట మున్సిపల్ పరిధిలో మొత్తం 42 మంది ప్రిసైడింగ్ అధికారులు, 126 మంది ఓపిఓలను కేటాయించినట్లు తెలిపారు. ఇల్లందు మున్సిపల్ పరిధిలో మొత్తం 62 మంది ప్రిసైడింగ్ అధికారులు, 187 మంది ఓపిఓలను కేటాయించినట్లు వివరించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 241 మంది ప్రిసైడింగ్ అధికారులు, 723 మంది ఓపిఓలను కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తంగా జిల్లాలోని 288 పోలింగ్ కేంద్రాలకు గాను 345 మంది ప్రిసైడింగ్ అధికారులు, 864 మంది ఓపిఓలు కలిపి మొత్తం 1036 మంది ఎన్నికల అధికారులను కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.
ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో సమన్వయంతో విధులు నిర్వర్తిస్తూ పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

# మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది: జిల్లాలో 48 గంటల నిశ్శబ్ద వ్యవధి అమలు

**: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**వార్తాపత్రిక: భద్రాద్రి కొత్తగూడెం :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఎన్నికల ప్రచారం 09-02-2026 సాయంత్రం 5.00 గంటలతో పూర్తిగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్‌కు ముందు 48 గంటల నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్) అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం, 2019లోని సెక్షన్ 209 ప్రకారం, నిశ్శబ్ద వ్యవధి సమయంలో ఎవరూ కూడా ఎన్నికలతో సంబంధం ఉన్న ఎలాంటి బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రజలను ఉద్దేశించి ఎన్నికల ప్రచార ప్రసంగాలు చేయడం, సినిమా, టెలివిజన్, ఇతర ఎలక్ట్రానిక్ మాధ్యమాలు, మొబైల్ ఫోన్లు మరియు సోషల్ మీడియా ద్వారా ఎన్నికల ప్రచారం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. అలాగేరాజకీయ పరమైన ఎస్ఎంఎస్‌లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపడం లేదా ఇతర వినోద కార్యక్రమాల ద్వారా ప్రజలను ఆకర్షిస్తూ ఎన్నికల ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నిశ్శబ్ద వ్యవధి సమయంలో సోషల్ మీడియాలో ప్రసారం అయ్యే సందేశాలను నిశితంగా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.
నిశ్శబ్ద వ్యవధి నిబంధనలను ఉల్లంఘించినట్లయితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం జారీ చేసిన సూచనలు, ఆదేశాలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ఎఫ్ఎస్‌టీ, ఎస్-ఎస్‌టీ, ఎంసీసీ బృందాలు మరియు పోలీస్ అధికారులు పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, కళ్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జింగ్ కేంద్రాల్లో విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ నిర్వహణ పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మరియు ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ పూర్తి స్థాయిలో
సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు.

# ఫిబ్రవరి 12 న జరగబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్
- నిజాంపేట్ చౌరస్తాలో సమ్మె వాల్ పోస్టర్ల విడుదల




**వార్తపత్రిక, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 9:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం నిజాంపేట్ చౌరస్తాలోని గాంధీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు ముఖ్యమైన నాలుగు డిమాండ్లను లేవనెత్తారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు.వేతనాల పెంపు నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నా మున్సిపల్ కార్మికుల జీతాలు పెరగడం లేదన్నారు. కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. పని దినాలు పెంచి రాష్ట్ర ప్రభుత్వంపై 40% భారం వేయడం వల్ల ప్రయోజనం లేదన్నారు. ఏకపక్ష ఒప్పందాలతో అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు ఏకపక్షంగా ఉన్నాయని, ఇది దేశ ప్రయోజనాలకు విరుద్ధమని ఆరోపించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును మార్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు ఆశి యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, భాగ్యమ్మ, నర్సమ్మ, ముత్యాలు, సైదమ్మ, కవిత, కృష్ణ, శేఖర్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# 4, 5,8,12 వార్డులలో సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలవాల వీరయ్య
- సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని బైక్ ర్యాలీ



**వార్త ప్రతిక:-మరిపెడ :** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 465 సర్వే నెంబర్ లో ఇండ్లకు పట్టాలు ఇవ్వాలని, ఆ ఇండ్లకు మున్సిపాలిటీ శాఖ పన్నులు వసూలు చేసి టాక్స్ తీసుకుంటున్న మున్సిపల్ శాఖ అధికారులు నేటి వరకు పేదల ఇండ్లకు పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలవాల వీరయ్య అన్నారు. మరిపెడ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా సోమవారం 4, 5,8,12 వార్డులలో సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆకాంక్షిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ మరిపెడ నుండి ప్రారంభమై అన్ని వార్డులలో పర్యటించింది, అంతకుముందు ఈ బైక్ ర్యాలీ ప్రారంభించిన అలవాల వీరయ్య మాట్లాడుతూ మరిపెడ గ్రామపంచాయతీ ఉన్న కాలంలోనే గత 30 సంవత్సరాలుగా పట్టణంలో నివసిస్తున్న ప్రజలు డబ్బులు పెట్టి కొనుక్కున్న ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలం గడుపుకుంటూ వస్తుందన్నారు. గత మున్సిపాలిటీ ఎన్నికల్లో 465 సర్వే నెంబర్లు ఉన్న ఇండ్లను రెగ్యులరైజేషన్ చేసి పట్టాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు కానీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిరాని ఆరోపించారు. గత బిఆర్ఎస్ పాలనలో నేటి కాంగ్రెస్ హామీలతో ప్రజలు మరోసారి మోసపోతున్నారని పేర్కొన్నారు. అంతేగాక ప్రజల నుండి పన్నులు వసూలు చేస్తున్న పట్టణ వ్యాపారస్తులకు ప్రజలకు అండగా నిలబడి వాటిని తగ్గించే వరకు సిపిఎం పోరాడిందని గుర్తు చేశారు. మున్సిపాలిటీ నిధులతో అభివృద్ధి చేయకుండా తోడు దొంగల కాంట్రాక్టు పనుల టెండర్లను, కాంట్రాక్టర్ల లాభాల కోసం చేపట్టిన పనులు పూర్తి చేయకుండానే బిల్లులు ఎలా మాయమైతాయని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న సిపిఎం మున్సిపాలిటీలో నాలుగు వార్డులలో పోటీలో నిలిచిందన్నారు. ఆ వార్డులలో సిపిఎం ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర పార్టీ అభ్యర్థులు గెలిస్తే పదవుల కోసం అమ్ముడు పోతారని, ఎవరు అధికారంలో ఉంటే వారి పార్టీ చేరి అవినీతి అక్రమాలకు పాల్పడడం ఆనవాయితీగా మారిందని అలాంటి వారికి అవకాశం ఇవ్వకుండా ఓడించి, ప్రజల కోసం పనిచేస్తున్న సిపిఎం సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పై మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్, మండల కమిటీ సభ్యులు కందాల రమేష్, కొండ ఉప్పలయ్య, సిపిఎం అభ్యర్థులు బాణాల రాజయ్య, అలవాల ఏకమ్మ, బాణాల శైలజ, అలవాల మహేష్, తదితరులు పాల్గొన్నారు

# కేసీఆర్ పాలనలో సుభిక్షం కాంగ్రెస్ పాలనలో దుర్భిక్షం

- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు
- కాంగ్రెస్ సర్కార్ గ్రామాలను ఎడారులుగా మార్చింది



**వార్తపత్రిక, రామాయంపేట, ఫిబ్రవరి 09:** కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, ఆనందంగా జీవించారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గ్రామాలు నీటి కష్టాలు, కన్నీటి బాధలతో ముంచెత్తుతున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు విమర్శించారు.మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు భారీ రోడ్ షో నిర్వహించారు. అనంతరం మెదక్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల సభలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై హరీష్ రావుకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సస్యశ్యామలంగా, పాడిపంటలతో సుభిక్షంగా ఉండేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక నీటి కష్టాలు, కన్నీటి బాధలు గ్రామాలను ముంచెత్తుతున్నాయని తీవ్రంగా విమర్శించారు. ఈ ఎన్నికలు ఎమ్మెల్యేలు, మంత్రుల కోసం కాకుండా ప్రజల భవిష్యత్తు, ప్రజాపాలన కోసం జరుగుతున్న ఎన్నికలని, ప్రజల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.
బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చిందో, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను ఎలా మరిచిందో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలన్నారు. రుణమాఫీ పేరుతో ప్రజలను, దేవుళ్లను మోసం చేశారని రేవంత్ రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.రామాయంపేట అభివృద్ధి మొత్తం కేసీఆర్ హయాంలోనే జరిగిందని, డిగ్రీ కాలేజీ, ఆర్డీఓ కార్యాలయం కేసీఆర్ ఇచ్చినవే అని గుర్తు చేశారు. గతంలో రైతులకు యూరియా ఇంటికే వచ్చేదని, ఇప్పుడు ఎరువులు దొరకడమే కష్టమైందన్నారు. వృద్ధులకు సమయానికి పింఛన్లు రావడం లేదని, కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదని విమర్శించారు. కల్యాణ లక్ష్మి, తులం బంగారం హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.కరోనా సమయంలో నిరుపేదలకు 15 కిలోల బియ్యం అందించిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, ఉచిత బస్సు పేరుతో పురుషులపై డబుల్ చార్జీలు పెంచారని విమర్శించారు. కావున ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ కౌన్సిలర్లను గెలిపించి మున్సిపల్ పీఠాన్ని బీఆర్ఎస్‌కు దక్కించాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, జిల్లా నాయకుడు కంట తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, సుప్రభాతరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చదువుతో పాటు విలువల బాటలో రేడియంట్ విద్యా నికేతన్

- ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి







**వార్తపత్రిక, కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 9:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఉత్తమ విద్యాబోధనతో పాటు అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ ప్రైవేట్ పాఠశాలల్లో రేడియంట్ శ్రీ విజ్ఞాన్ విద్యా నికేతన్ ఒక ఆదర్శ పాఠశాలగా నిలుస్తోందని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి ప్రశంసించారు.
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పరిధిలోని రేడియంట్ శ్రీ విజ్ఞాన్ విద్యా నికేతన్ పాఠశాల 16వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి అభినందనలు తెలిపారు.ఈ వేడుకలలో పాఠశాల విద్యార్థులు సంప్రదాయ ఆటపాటలు, ప్రత్యేక వేషధారణలతో ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. ముఖ్యంగా సెల్ ఫోన్ వాడకం, మద్యపానం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులు ప్రదర్శించిన డ్రామా కార్యక్రమం అందరి మనసులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా డాక్టర్ శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ, చదువుతో పాటు విద్యార్థుల్లో సామాజిక అవగాహన, నైతిక విలువలు పెంపొందించే విధంగా రేడియంట్ శ్రీ విజ్ఞాన్ విద్యా నికేతన్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలతో నెంబర్ వన్ పాఠశాలగా రాణించడం గర్వకారణమని అన్నారు.అనంతరం 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ శివరాత్రి యాదగిరిని పాఠశాల యాజ మాన్యం ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజే శారు. యాజ మాన్యం మాట్లాడుతూ, గత 16 సంవత్సరాలుగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు అనుకూలంగా అతి తక్కువ ఫీజులతో నా ణ్యమైన విద్య అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడం తమకు గర్వకారణమని తెలిపారు. ఇందుకు సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిత్యం పరమాత్ముని పూజించి అనుగ్రహం పొందండి

- రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి



**పాపన్నపేట, ఫిబ్రవరి 09:(వార్తాపత్రిక ప్రతినిధి):** పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సన్ పల్లి గ్రామంలో శ్రీ ఉమా కేదారేశ్వర క్షేత్రంలో ప్రతి నెల జరిగే పూజా కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం రంగంపేట పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ మదానంద సరస్వతి స్వామివారి హాజరై మాట్లాడుతూ పరమాత్ముడికి మించిన సేవ మరొకటి లేదని, నిత్యం పరమాత్ముని పూజించడం వల్ల మనశ్శాంతి లభిస్తుందన్నారు.దైవ బలానికి మించిన బలం మరొకటి లేదని పేర్కొన్నారు.స్వామివారికి పాదపూజను పాపన్నపేట గ్రామానికి చెందిన గాజవాడ రాజేశ్వర్ గుప్తా దంపతులు నిర్వహించారు.
ఈ సందర్భంగా భక్తు లు స్వామివారినీ దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజశేఖర్ శర్మ, శ్యాం సుందర్ శర్మ,రామ్ శర్మ, నర్సింలు గుప్తా,ఇంద్రసేనారెడ్డి, భూమయ్య గుప్తయాబన్న గుప్తా, భూ షణం గుప్తా,ఎర్రం రవీందర్ గుప్తా,విట్టల్ గుప్తా, సంగమేశ్వర్ గుప్తా తదితర భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా పి ఆర్ టి యు ఆవిర్భావ దినోత్సవం పాపన్నపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు




**పాపన్నపేట, ఫిబ్రవరి 09:(వార్త పత్రిక ప్రతినిధి) :** పాపన్నపేట కేంద్రంలో సోమవారం పిఆర్టియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాపన్నపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బాధ్యులు అందరు పిఆర్టియు వ్యవస్థాపకులు సామల యాదగిరి గారి సంఘ సేవలను కొనియాడుతూ ప్రతి బాధ్యుడు సంఘ పటిష్టతకై కృషి చేస్తూ ఉపాధ్యాయుల సమస్యల కొరకు రాజీ లేని పోరాటం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో సంఘ పటిష్టతకు కృషిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను మండల శాఖ తరుపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు రాజు, సురేష్ మండల సీనియర్ బాధ్యులు వెంకట్రాంరెడ్డి, విశ్రాంత మండల విద్యాధికారి మోహన్ రాజు, రాష్ట్ర జిల్లా మండల బాధ్యులు అంజనా చారి, శ్రీనివాసులు, కిషన్, రవీందర్ రెడ్డి, జనార్ధన్, సంధ్యారాణి, సిద్ధి రాములు, ప్రవీణ్, ధనుంజయ్, మధు, సంతోష్, పసియుద్దీన్, పోత రెడ్డి, వెంకట్, చందు, సలీం పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



- కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తిప్పి కొట్టండి
- అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు

**వార్తాపత్రిక: భద్రాది కొత్తగూడెం :** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తిప్పికొట్టాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కార్మికులను కోరారు. సోమవారం కే సిహెచ్ పి తదితరచోట్ల కార్మికుల అడ్డా మీటిం గులలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఆర్. మధుసూదన్ రెడ్డి, టి యు సి ఐ, వెలగపల్లి. ఐ ఎన్ టి యు సి గడ్డం. వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్నటువంటి నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వం కార్మికుల శ్రమ ను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కంకణం కట్టుకున్నదని దానిలో భాగంగానే ముందు తరాల కార్మిక వర్గం పోరాడి సాధించ ుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తీసుక ువచ్చింది అన్నారు. వేతనాల కోడ్ ను 2019 లో, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020 సెప్టెంబర్ లో ప్రతిపక్ష పార్టీల ఎంపీలందరూ వీటిని వ్యతిరేకిస్తూ పార్లమెంటును బైకాట్ చేసిన సందర్భంలో, దేశం మొత్తం కరోనా కష్టకాలంలో ఉండగా పార్లమెంటులో ఆమోదిం ప చేసుకున్నారని అన్నారు. ఈ దేశ ప్రజల, కార్మికుల సంక్షేమం కంటే, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలే వీరికి ముఖ్యమన్నారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెల ఫలితంగా అమలుకు పూనుకోని కేంద్ర ప్రభుత్వం 2025 నవంబర్ లో నోటిఫై చేసి, 2026, ఏప్రిల్ నుండి అమలుకు సిద్ధమవుతుందన్నారు. ఈ లేబర్ కోడ్ లు అమలు అయితే కార్మిక హక్కులు కాల రాయబడతాయి అన్నారు. వీటిని తిప్పకొట్టవలసిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. లేకపోతే కార్పొరేట్ శక్తులకు కార్మిక వర్గం కట్టు బానిసలుగా తయారయ్యే ప్రమాదం ఉందన్నారు. ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తిప్పి కొట్టాలన్నారు. ఫిబ్రవరి 12న మణుగూరు ఏరియా కార్మిక వర్గం మొత్తం సమ్మెలో పాల్గొని, ఉదయం 9 గంటల వరకు స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్దకు చేరుకోగలరని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద నుంచి ప్రదర్శన నిర్వహించబడుతుందన్నారు.
ఈ సమావేశంలో వీ. జానయ్య, వీరభద్రం, సంజీవరావు, వెంకటేశ్వర్లు. వెంకన్న, ఎస్. వెంకటేశ్వర్లు మరియు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణలో హత్యలు, దారుణాలు పెరిగాయి
# సీఎం రేవంత్‌పై డీకే అరుణ ధ్వజం

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 9, :** సీఎం రేవంత్‌రెడ్డిపై( బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ(తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దారుణాలు పెరిగిపోయాయని ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ట్యాక్స్‌లు పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపించారు. రాష్ట్ర ఖజానాలో చిల్లిగవ్వ లేదని చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు.కేంద్ర నిధులు అవసరం.మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని అరుణ తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ప్రచారం నిర్వహించానని చెప్పుకొచ్చారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్,



భూత్‌పూర్, జడ్చర్ల మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అవసరముందని ఎంపీ అన్నారు.అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్.మహబూబ్‌నగర్ చుట్టుపక్కల గ్రామాలు విలీన గ్రామాలుగా కలిశాయని ఎంపీ అరుణ వివరించారు. కార్పొరేషన్ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ కూడా అవసరం ఉందని చెప్పుకొచ్చారు. పట్టణాల్లో స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలవగానే సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. అవినీతి రహిత, పారదర్శకమైన పాలన అందించ డమే బీజేపీ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై దృష్టి సారించి.. కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ మేనిఫెస్టోను ప్రజలకు అనుకూలంగా తయారుచేసి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని డీకే అరుణ పేర్కొన్నారు.

# మందుబాబులకు బ్యాడ్ న్యూస్
# 2 రోజులు పాటు వైన్స్, బార్లు బంద్!




తెలంగాణ రాష్ట్రంలో మందు బాబులకు ఇదో బ్యాడ్ న్యూస్ అనే చెప్పాలి. ఎందుకంటే రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం సాయంత్రం 5గంటల నుంచి పోలింగ్ తేదీ అనగా ఫిబ్రవరి 11 సాయంత్రం 5గంటల వరకు రాష్ట్రంలోని ఎన్నికలు జరిగే 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో ఉన్న వైన్‌షాపులు, బార్లు మూతపడనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. అలాగే ఎన్నికల ఫలితాల రోజు అనగా ఫిబ్రవరి 13న కూడా మద్యం షాపులు, బార్లు మూతబడనున్నట్టు అధికారులు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.ఇక రాష్ట్రంలో సోమవారం సాయంత్రంతో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో ఈ ఆంక్షలను అమల్లోకి తీసుకురానున్నట్టు అధికారులు స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయించినా, షాపులు ఓపెన్ చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా దుకాణాలు లైసెన్స్‌లు కూడా రద్దు చేస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయితే ఈ ఆంక్షలు కేవలం ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోనే ఉంటుందని అధికారులు తెలిపారు.

# ఫిబ్రవరి 12వ తేదీన జరగబోయే
# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

## -సమ్మె వాల్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది.
## -నాలుగు లేబర్ కొడ్లను రద్దు చేయాలి.
## -ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్



**నిజాంపేట్ :** ఫిబ్రవరి 12వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చెయ్యాలని, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిజాంపేట్ చౌరస్తా గాంధీ విగ్రహం వద్ద సమ్మెకు సంబందించిన వాల్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతు ఫిబ్రవరి 12వ తేదీన జరిగే సమ్మెను కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలనీ పిలుపునిచ్చారు. నిత్యవసర ధరలు పెరుగుతున్న మున్సిపల్ కార్మికుల జీతాలు పెరగడం లేదు అని, మున్సిపల్ లో పని చేసే కార్మికులకు ఇరవై ఆరు వెయ్యిలు జీతం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక పోరాడి సాధించుకున్న ఇరువై తొమ్మిది కార్మిక చట్టాలకు బదులుగా నాలుగు లేబర్ కొడ్లు తెచ్చాడు అని అన్నారు. కనుక కార్మిక వెతిరేక నాలుగు లేబర్ కొడ్లను వెంటనే రద్దు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల అమెరికతో వాణిజ్య ఒప్పందం కేవలం ఏక పక్షంగా ఉంది అని అన్నారు. మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం బదులుగా పథకం పేరు మర్చి రామ్ జీ అని రాముని పేరు పెట్టి అందులోని అసలు విషయని తప్పు దారి పట్టిస్తున్నారు అని వారు గుర్తు చేశారు. ఈ పథకంలో పని దినాలను వంద నుండి నూట ఇరవైకీ పెంచి రాష్ట్ర పై నలపై శాతం బారం వేశారు. దాని వల్ల రాష్ట్ర పై భారం పడుతుంది అని, కనుక పని దినాలు ఎన్ని పెంచి ఉపయోగం లేదు అని వారు అన్నారు. కనుక ఫిబ్రవరి 12వ తేదీన సబండవర్గలు సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలి అని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి,భాగ్యమ్మ, నర్సమ్మ, ముత్యలు, సైదమ్మ, కవిత,కృష్ణ, శేఖర్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు తప్పిన ప్రమాదం



**మంచిర్యాల జిల్లా:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు పెను ప్రమాదం తప్పింది. మంచిర్యాల పట్టణంలోని బస్టాండ్ రోడ్డులో ఎమ్మెల్యే కాన్వాయ్ పైకి ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా దూసుకొచ్చింది. గమనించిన ఎమ్మెల్యే డ్రైవర్ అప్రమత్తమై చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది.

# రేపు నోట్లు.. ఎల్లుండి ఓట్లు

- పోటాపోటీగా అక్రమాలు
- గెలుపే లక్ష్యంగా పంపకాలు
- గుబులు పుట్టిస్తున్న ఓటర్ శైలి
- ముగిసిన ఎన్నికల ప్రచారం
- బంధువుల అకౌంట్ ద్వారా యూపీఐ చెల్లింపులు

**వార్త పత్రిక,డోర్నకల్ :-**మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ప్రలోభాల పరంపర కొనసాగుతోంది. పురపాలక సంఘాల ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు పార్టీలు తాయిలాల పంపెనీకి శ్రీకారం చుట్టాయి. కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ స్లిప్పులతోనే మద్యం సీసాలు పంపిణీ చేస్తూ తమ ప్రత్యేకతను చాటుకొంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో చికెన్, మటన్, స్వట్ ప్యాకెట్లు, కూల్ డ్రింక్స్, బిర్యానీలు, చీరలు, స్టీల్ క్యాన్ల పంపిణీ జరుగుతోంది. అయితే ఈ పంపిణీ గుట్టు చప్పుడు కాకుండా సాగుతోంది. దూర ప్రాంతాలనుంచి వచ్చే వారికి ప్రయాణ భత్యాలు ఆఫర్ చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా ఎన్నికల సంఘం అధికారులు, పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వివాదాలకు కారణమవుతోంది.

**అంతా సైలెన్స్..**

సోమవారం ఆఖరి రోజు కావడంతో సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగిసింది. కార్నర్ మీటింగులు, బైక్ ర్యాలీలు, డోర్ టు డోర్ వంటి ప్రచారాలను ముమ్మరంగా నిర్వహించారు. ఎన్నికల నిబంధనల మేరకు పోలింగ్ ముగియడానికి 48 గంటల ముందు నుంచి కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో సైలెన్స్ పీరియడ్ అమల్లోకి వస్తుంది. ఈ సమయంలో బయటినుంచి ప్రచారం నిమిత్తం వచ్చిన వ్యక్తులు, లీడర్లు, పార్టీ కార్యకర్తలు పట్టణాలను విడిచి వెళ్లిపోవాల్సి ఉంటుంది. సోమవారం సాయంత్రం 5 గంటలనుంచి ఎన్నికలు పూర్తయ్యేవరకు మద్యం విక్రయాలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఆయా మద్యం దుకాణాలకు సీల్ వేశారు.

**అయోమయం...**

ఈ నెల 11వ తేదీన జరుగనున్న పుర ఎన్నికల్లో ఓటర్ల నాడి పట్టేందుకు అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. తనకే ఓటు వేయాలని అభ్యర్థించిన ప్రతి ఒక్కరికీ కాదు... కూడదు అనకుండా హామీ ఇస్తున్నారు. మా ఓటు తప్పకుండా మీకే అంటు హామీ ఇస్తున్నారు. ఓటర్ శైలి పోటీ పడుతున్న అభ్యర్థుల్లో గుబులు పుట్టిస్తోంది. పైకి గంభీరాన్ని ప్రదర్శిసున్నప్పటికీ లోపల మాత్రం డబ్బు, శ్రమతో పాటు పరువు పోతుందని టెన్షన్ పట్టుకుంది. ఒకసారి అవకాశం ఇచ్చి చూడండి అభివృద్ధి చేసి చూపిస్తానంటూ ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న యువ అభ్యర్థులకు సైతం ఓటర్లు ఇదే పాట వినిపిస్తున్నారు...

**భయం.. భయం..**

బుధవారం జరుగునున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు భయం పట్టకుంది. మీకే మా ఓటు అంటూ అందరినీ మెప్పిస్తున్న ఓటర్లను చూసి అభ్యర్థులు భయపడుతున్నారు. తీర సమాయానికి ఎవ్వరికి ఓటు వేస్తారో అనే సందేహం అందరిలో కలిగిస్తోంది. ప్రధానంగా అధికార కాంగ్రెస్ తో పాటు బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు, నాయకులలో ఈ టెన్షన్ నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని సారే.. కారే రావాలంటున్నది తెలంగాణ అంటూ బీఆర్ఎస్. నాయకులు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. భాయి నీకు బాదెందుకు.. మూడు రంగుల జెండా నీదే.. అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ సంక్షేమ పథకాలను ప్రచార అస్త్రాలుగా వాడుకుంటుంది. అయితే వార్డుల్లో అనేక సమస్యలతో సతమతమవుతున్నామని పరిష్కరించే వారు లేరని ప్రజలు గగ్గోలు పెడుతు ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు.

**ముగిసిన ప్రచారం..**

పుర ఎన్నికల్లో మరో కీలక ఘట్టానికి సోమవారం తెరపడింది. సాయంత్రం ఐదు గంటలకు ప్రచార ఘడియలు ముగిసాయి. గల్లీల్లో మారు మ్రోగిన మైకులు మూగబోయాయి. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు ఏడు కార్పొరేషన్లకు బుధవారం ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకు మొత్తం 1,294 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 48 గంటలు సైలెన్స్ పీరియడ్ సమయంలో పట్టణంలో ఎవరూ బహిరంగంగా ఎన్నికల ప్రచారం చేయరాదని హెచ్చరికలు ఉన్నాయి. పోలింగ్ ముగిసేంత వరకు మద్యం, కల్లు దుకాలను మూసి ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్లు ఆదేశించారు. 13న కౌంటింగ్ మూగిసే వరకు డ్రైడే అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే మందు విందుతో పార్టీలు చేసిన అభ్యర్థులు ఇక ఓటును దక్కించుకునేందుకు సిద్దంగా ఉన్నారు. పట్టణాలల్లో కౌన్సిలర్ అభ్యర్థులు దాదాపు రూ. 10 లక్షల వెచ్చించేందుకు సిద్ధపడ్డారని తెలుస్తోంది.

ఒక్కో ఓటుకు రూ. 2వేల నుంచి రూ.5 వేల వరకు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు.

# ఖమ్మం జిల్లాలో సాగునీటి కోసం రైతన్నల ధర్నా



**ఖమ్మం జిల్లా :** ఖమ్మం జిల్లాలో సాగునీటి కోసం రైతన్నలు రోడ్డెక్కారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తి వద్ద రహదారిపై రాస్తారోకోకు దిగారు. సాగు నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని.. వెంటనే సాగునీటిని అందించిన పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు.నాగార్జున సాగర్ నుంచి అధికారులు నీళ్లు విడుదల చేయకపోవడంతో తమ మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయని ఈ సందర్భంగా రైతన్నలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్థానిక నాయకులను కలిసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనికి నిరసనగానే ఏన్కూరు -- పల్లిపాడు రహదారిపై రైతన్నలు ఆందోళనకు దిగారు. రైతుల ఆందోళనతో రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

# ఫిబ్రవరి 24న టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ ఛలో సెక్రటేరియట్‌కు పిలుపు


**హైదరాబాద్ :** ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ ఈనెల 24న ఛలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చింది.సోమవారం ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జేఏసీ నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి హాజరై మాట్లాడారు.ఆర్టీసీ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సుమారు రెండున్నర సంవత్సరాల నుంచి జేఏసీ ఆధ్వర్యంలో



పలు ఉద్యమాల ద్వారా ముఖ్యమంత్రి , మంత్రుల దృష్టికి, యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్లగా హామీల అమలుకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని, యూనియన్లపై ఆంక్షలను ఎత్తివేస్తామని, 2021 వేతన సవరణ అమలు చేస్తామని, ఆర్టీసీని విస్తరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి ఏ ఒక్కటీ అమలు చేయకుండా విస్మరించిందని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులపై ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పెట్టి విపరీతమైన పనిభారాలు మోపిందని, రోజుకు 16 గంటలు బలవంతంగా డ్యూటీలు చేయిస్తూ కార్మికుల నడ్డి విరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు సి.ఎన్.కృష్ణ, జె.రాఘవులు, ఎన్.బాల్ రెడ్డి, ఎన్.బుద్ధ విశాల్, ఎం.ఎ.మజీద్, డి.రాంచందర్, పాపయ్యగౌడ్, ము త్యాలు, రమేష్ , ప్రచార కార్యదర్శి సాయినాథ్ పాల్గొన్నారు.

# ఆడపిల్లకు భరోసా.. సర్పంచ్‌కు గ్రామస్తుల అభినందనలు

**నిజాంపేట, ఫిబ్రవరి 9:** నిజాంపేట మండలంలోని రజకపల్లి సర్పంచ్ వొజ్జ కనకరాజు సరికొత్త ఆలోచన చేసి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సర్పంచ్ కనకరాజు కాసింపూర్ గ్రామంలో పుట్టిన ఆడపిల్లకు కిట్టుతోపాటు రూ. 5000ను అందజేశారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో సమానమనే భావనతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు సర్పంచ్ కనకరాజు తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న సర్పంచ్ కనకరాజును గ్రామస్తులు అభినందించారు . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఆశా వర్కర్లు అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# టీటీడీ లడ్డూ వ్యవహారం హిందూ ధార్మిక సంఘాల నిరసన



**తిరుపతి, ఫిబ్రవరి 9, :** అలిపిరి గరుడ సర్కిల్ వద్ద హిందూ ధార్మిక సంఘాలు సోమవారం నిరసనకు దిగాయి. వైసీపీ హయాంలో తిరుమలలో చేసిన పాపాలు ఒప్పుకోవాలంటూ నినాదాలు చేశాయి. టెంకాయలు కొట్టి క్షమించు దేవుడా అంటూ వేడుకున్నాయి. శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసిన హిందూ ద్రోహులను క్షమించకూడదని హెచ్చరించాయి. ఏడుకొండల స్వామి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వైసీపీని ప్రజలు స్వచ్ఛందంగా బహిష్కరించాలని పిలుపునిచ్చాయి.స్వామివారి లడ్డూ ప్రసాదం కల్తీ పాపం కాదని.. మహా పాపమని హిందూ ధార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రసాదం కల్తీ చేయడమంటే భక్తుల విశ్వాసంపై దాడి చేసినట్లేనని చెప్పుకొచ్చాయి. కుట్రపూరితంగా కల్తీ చేసిన గత వైసీపీ ప్రభుత్వానికి హిందువులే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చాయి. తిరుమల క్షేత్రంపై జరిగిన కుట్రలపై విచారణ జరపాలని డిమాండ్ చేశాయి. తిరుమలపై దాడి జరిగితే హిందువులంతా గొంతెత్తాలని, వైసీపీ నేతలు వేంకటేశ్వరస్వామికి, శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశాయి. కల్తీ నెయ్యి వ్యవహారంపై త్వరలోనే రాష్ట్రపతిని కలుస్తామని హిందూ ధార్మిక సంఘాలు స్పష్టం చేశాయి.

# ఏపీ లిక్కర్ స్కాం కేసులో కసిరెడ్డికి రెగ్యులర్ బెయిల్ తిరస్కరణ



**ఢిల్లీ, ఫిబ్రవరి 9, :** సుప్రీం కోర్టులో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఊరట దక్కలేదు. ఏపీ లిక్కర్ కుంభకోణం కేసులో కసిరెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇవ్వడానికి సుప్రీం ధర్మసనం నిరాకరించింది. ఈ కుంభకోణంలో కసిరెడ్డి ఎన్ని కోట్లు అక్రమంగా ఆర్జించారని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సూటిగా ప్రశ్నించారు. సుమారు రూ.750 కోట్ల కుంభకోణంలో 9 నెలలుగా జైల్లో ఉండటం పెద్ద సమయమేమీ కాదని అన్నారు. ఈ కేసులో ప్రధాన కుట్రదారు కసిరెడ్డి అని తెలుస్తోందని తెలిపారు.రూ.750 కోట్లు డిపాజిట్ చేసిన షెల్ కంపెనీతో కసిరెడ్డి నేరుగా సంబంధాలున్నట్లు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతానికి కసిరెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేశారు. అయితే తమ వాదనలు వినిపించడానికి కొంత సమయం కావాలని ధర్మాసనాన్ని కసిరెడ్డి తరపు న్యాయవాది కోరారు. తదుపరి విచారణను వచ్చే గురువారానికి ధర్మాసనం వాయిదా వేసింది. ఏపీ లిక్కర్ కుంభకోణం కేసులో బెయిల్ కోసం సుప్రీంకోర్టుని కసిరెడ్డి ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే, కసిరెడ్డికి గతంలో రెగ్యులర్ బెయిల్‌ని ఏపీ హైకోర్టు నిరాకరించింది. ఈ క్రమంలోనే హైకోర్టు తీర్పును సుప్రీంలో కసిరెడ్డి సవాలు చేశాడు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. కసిరెడ్డి బెయిల్‌ను వ్యతిరేకిస్తూ ఏపీ ప్రభుత్వం తరపున సిద్ధార్థలూథ్రా వాదించారు.

# శ్రీకాళహస్తిలో ఫేక్ పూజల ప్రచారం ఆలయ అధికారుల అలర్ట్



**తిరుపతి, ఫిబ్రవరి 9:** శ్రీకాళహస్తి ఆలయంలో మహాశివరాత్రి రోజున రాహు కేతు పూజలు నిర్వహిస్తామంటూ ప్రచారం చేసిన దేవధాం యాప్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. శ్రీకాళహస్తి ఆలయంలో మహాశివరాత్రి రోజు రాహు కేతు పూజలు నిర్వహిస్తామని ఇన్‌స్టాగ్రామ్‌లో దేవధాం యాప్ పేరుతో కొందరు ప్రచారం నిర్వహించారు. యాప్ ద్వారా బుక్ చేసుకుంటే ఆలయం ముందు నుంచి వీడియో చిత్రీకరణ చేయిస్తామని చెప్పారు. అయితే, శ్రీకాళహస్తి దేవస్థానం మహాశివరత్రి రోజు రాహు కేతు పూజల్ని రద్దు చేసిన విషయం తెలిసిందే.శ్రీకాళహస్తి ఆలయంలో రాహు కేతు పూజలు నిర్వహించే పద్ధతికి భిన్నంగా దేవధాం యాప్ చార్జీలు ప్రకటించింది. ఆలయంలో పూజలో పాల్గొనే వారికి ఎక్కడ పూజ చేసుకుంటారో అనేదాన్ని బట్టి చార్జీలు నిర్ణయిస్తారు. కానీ, ఈ యాప్‌లో మాత్రం ఎంత మంది పాల్గొంటే అంత ఎక్కువ అమౌంట్ వసూలు చేస్తామని ప్రకటించారు. అంతేకాకుండా, పూజ తర్వాత ప్రసాదాలు ఇచ్చే సంప్రదాయం ఆలయంలో లేకపోయినా.. దేవధాం యాప్.. ప్రసాదాన్ని కొరియర్ చేస్తామని ప్రకటించింది. ఈ ప్రచారాన్ని గుర్తించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ప్రతినిధులు.. వీడియోలు, యాప్‌లోని వివరాలను సేకరించి.. శ్రీకాళహస్తి ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరారు.వివరాలు తీసుకున్న ఆలయ అధికారులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దేవధాం యాప్‌పై శ్రీకాళహస్తి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. భక్తులు ఇలాంటి యాప్‌లకు దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఏపీఎస్ ఆర్టీసీ పనితీరుపై సీఎం చంద్రబాబు ప్రత్యేక ప్రశంసలు.



**అమరావతి, ఫిబ్రవరి 9:** సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రులు, కార్యదర్శుల సమీక్షా సమావేశంలో స్త్రీ శక్తి పథకం విజయవంతమైన అమలుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఏపీఎస్ ఆర్టీసీ పనితీరుపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రశంసలు కురిపించారు. ఈ ప్రశంసలపై సంతోషం వ్యక్తం చేసిన మంత్రి మండిపల్లి.. తమకు బాధ్యత మరింత పెరిగిందన్నారు.స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటివరకు 4 కోట్ల మంది మహిళా ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణ సేవలను ఏపీఎస్ ఆర్టీసీ విజయవంతంగా అందించిందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. స్త్రీ శక్తి పథకాన్ని కేవలం బరువుగా కాకుండా బాధ్యతగా స్వీకరించి సేవలు అందిస్తామని తెలిపారు. భవిష్యత్తులో మెరుగైన సేవలను మహిళలకు అందిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# కుక్కల గురించి మాట్లాడతారు, పిల్లల గురించి మాట్లాడరా





**అమరావతి, ఫిబ్రవరి 9:**తెలుగు రాష్ట్రాల్లో కొద్దిరోజులుగా వీధి కుక్కల సంరక్షణ అంశం హాట్‌టాపిక్ అయ్యింది. కొందరు సెలబ్రిటీలు వీధి కుక్కల్ని సంర క్షించాలని బాధ్యత ఉందని కామెంట్స్ చేస్తుంటే.. మరికొందరు మాత్రం వీధి కుక్కలు మనుషుల, పిల్లలపై దాడి చేస్తుంటే వాటిని ఎలా సంరక్షిస్తారని ప్రశ్నిస్తున్నారు. శునకాల గురించి డిబేట్ జరు గుతున్న వేళ వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆరె శ్యామల ట్వీట్ హాట్‌టాపిక్ అయ్యింది. కుక్కల సంరక్షణ గురించి మాట్లాడే సెలబ్రిటీలు.. గిరిజన బిడ్డల గురించి ఎందుకు మాట్లాడం లేదు అంటూ ట్వీట్ చేశారు.'కుక్కల సంరక్షణపై మాట్లాడడానికి మనకు ఎందరో సెలబ్రిటీలు ఉన్నారు.. కానీ గిరిజన బిడ్డల గురించి మాట్లాడడానికి ఎవరూ లేకపోవడం దౌర్భాగ్యం!. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉడకని ఇడ్లీ , నిల్వ చట్నీ.. 89 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో 70 మందికి చికిత్స.. ఒకే మంచంపై నలుగురె దుగురికి సెలైన్లు. ఆశ్రమ పాఠశాలల్లో మరణమృదంగం మోగు తున్నా.. తీరు మారని బాబు సర్కారు.. గిరిజన విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం. కూటమి అధికారం చేపట్టాక ఏపీలో ఇప్పటివరకు సరైన ఆహారం , మంచినీరు , వైద్యం లేక.. 50 మంది వరకు మరణించారు.. వందలమంది అనారోగ్యం బారిన పడ్డారు. దీనిపై ఏ మీడియాలోనూ చర్చలు జరగవు.. ఏ మేధావులూ మాట్లాడరు. కుక్కల సంరక్షణపై మాట్లాడడానికి మనకు ఎందరో సెలబ్రిటీలు ఉన్నారు.. కానీ గిరిజన బిడ్డల గురించి మాట్లాడడానికి ఎవరూ లేకపోవడం దౌర్భాగ్యం' అంటూ ట్వీట్ చేశారు.వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిది ఆరె శ్యామల ట్వీట్ పరోక్షంగా.. సినీ నటి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాజీ సతీమణి రేణూదేశాయ్ కుక్కల సంరక్షణ గురించి ఇటీవల చేసిన వ్యాఖ్యల్ని పరోక్షంగా ప్రస్తావించారా అనే చర్చ జరుగుతోంది. కుక్కల్ని సంరక్షించాలని బలంగా వాయిస్ వినిపిస్తున్న వాళ్లు గిరిజన పిల్లలు, వారి సమస్యల గురించి ఎందుకు మాట్లాడటం లేదని శ్యామల ప్రశ్నిస్తున్నారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో వీధి కుక్కల్ని చంపడంపై రేణూ దేశాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. తాను ఎప్పుడూ వ్యక్తిగత హక్కుల కోసం పోరాటం చేయలేదన.. కానీ కుక్కల విషయంలో మాత్రం తన పోరాటం ఆగదు అన్నారు. ఎక్కడో ఒకటి, రెండు చోట్ల జరిగిన ఘటనలతో కుక్కల్ని చంపాలనడం సరికాదన్నారు.పోలవరం జిల్లా దేవరపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఇడ్లీలు తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులతో ఇబ్బంది పడ్డారు.. వెంటనే మొత్తం 89మందిని ఆస్పత్రికి తరలించారు. వారిలో కొందరు కోలుకోవడంతో తిరిగి స్కూల్‌కు పంపించారు.. మిగిలినవారు ఆస్పత్రిలో ఉన్నారు. అయితే విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి ఇడ్లీ రవ్వ, శనగపిండి కారణమి తేల్చారు.. గడువు ముగిసిన వాటితో ఫుడ్ తయారు చేయడమే కారణం అంటున్నారు. ఈ వ్యవహారంలో స్కూల్ వార్డెన్, వంటమనిషిని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సస్పెండ్ చేశారు.. విచారణ జరుగుతోంది. మరోవైపు దేవరపల్లి స్కూల్‌లో విద్యార్థులు అస్వస్థకు గురైన ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు.. అధికారులతో సమీక్ష చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి.. తనకు నివేదించాలని ఆదేశించారు. అధికారులు పరిస్థితిని సీఎంకు వివరించారు. ఆరె శ్యామల కూడా ఈ ఘటనను ప్రస్తావిస్తూ ఈ ట్వీట్ చేశారు.

# సీఎం అధ్యక్షతన కీలక సమీక్షా సమావేశం ఫలితాలే ముఖ్యమన్న డిప్యూటీ సీఎం



**అమరావతి, ఫిబ్రవరి 9:** సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులతో కీలక సమీక్షా సమావేశం సోమవారం ప్రారంభమైంది. సీఎస్ కె.విజయానంద్ స్వాగతోపన్యాసం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. పల్లె పండగ కార్యక్రమం కింద గత ఏడాది రూ.2,500 కోట్లు మంజూరు చేస్తే, ఇప్పుడు 2.0 కింద రూ.5,700 కోట్లు, అడివితల్లి బాటకు రూ.1,005 కోట్లు, సాస్కికి రూ.2,123 కోట్లు.. మొత్తం రూ.11,328 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు.జలజీవన్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర షేర్లతో పనులు జరుగుతున్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇప్పటికే రూ.10 వేల కోట్ల పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. ఉన్న తక్కువ వనరులను ఉపయోగించుకొని ఎక్కువ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాని సహాయ సహకారాలు, ముఖ్యమంత్రి అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు. ప్రతి రూపాయి క్షేత్రస్థాయిలో కనిపించాలని... ప్రాజెక్టులు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఉదాసీనత ఉంటుందన్నారు డిప్యూటీ సీఎం. ముఖ్యమంత్రి ఇచ్చిన టార్గెట్‌లు రీచ్ కావలంటే చాలా వరకూ ఎక్స్క్యూజెస్ కనిపిస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి, తాను అకౌంటబిలిటీ ఫిక్స్ చేసుకుంటున్నామని.. అందుకే క్షేత్ర స్థాయిలో ఫలితాలు రావాలని కోరుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.చర్చించే అంశాలివే.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో జీఎస్డీపీ వృద్ధి రేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధన కోసం పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖల పురోగతిపై సమీక్షించనున్నారు. 2026-27లో కేంద్ర ప్రాయోజిత పథకాల కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు సీఎం. రియల్ టైమ్ గవర్నెన్స్‌లో భాగంగా అవేర్ సిస్టమ్, పాలనలో ఏఐ టూల్స్, ఇతర సాంకేతికతల వినియోగంపై సమావేశంలో చర్చ జరగనుంది. అలాగే నైపుణ్యాభివృద్ధి, వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్ విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, రాష్ట్రంలో శాంతిభద్రతల అంశాలపై సీఎం సమీక్ష చేపట్టనున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# లవ్ జిహాద్ టైపులో లడ్డూ జిహాద్ జరిగిందేమో శ్రీనివాసానంద సరస్వతి సంచలన వ్యాఖ్యలు



**విశాఖపట్నం, ఫిబ్రవరి 9, :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి సంచలన వ్యాఖ్యలు చేశారు. లవ్ జిహాదీ టైపులో లడ్డూ జిహాద్ జరిగిందేమోననే అనుమానం తమకు ఉందన్నారు. వైసీపీ హయాంలో లడ్డూని కల్తీ చేశారని ధ్వజమెత్తారు. ఇంతవరకు ఎప్పుడూ లడ్డూ వివాదం లేదని, జగన్ హయాంలో తిరుపతి లడ్డూ నాణ్యత లేదని.. ఇది అన్యమతస్తుల కుట్ర అని ధ్వజమెత్తారు. తిరుమల లడ్డూను హిందువులు పరమ పవిత్రంగా భావిస్తారని...ఈ విషయంలో తాము చాలా బాధపడుతున్నామని తెలిపారు. జగన్ పాలనలో తిరుపతి లడ్డూపై చర్చ జరిగిందని ప్రస్తావించారు. లడ్డూ కల్తీ జరిగిందని కూటమి నాయకులు మాట్లాడినప్పుడు తాము పట్టించుకోలేదని అన్నారు. తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని సీబీఐ రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. సోమవారం విశాఖపట్నంలో శ్రీనివాసానంద సరస్వతి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.సిట్ రిపోర్టుతో భయాందోళన.సిట్ రిపోర్టుతో తాము భయాందోళనకు గురయ్యామని, సిట్ నివేదికతో హిందువులు ఆందోళన చెందుతున్నారని శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. రూ.20 కోట్ల లడ్డూలు కల్తీ అయ్యాయని సీబీఐ తేల్చిందని చెప్పుకొచ్చారు. పవిత్రమైన లడ్డూలో ఫుడ్ మాఫియా జరిగిందని ఆరోపించారు. రసాయనాలు కలిసిన లడ్డూ తిని భక్తులు అనారోగ్యాలు పాలయ్యే అవకాశం ఉందని అన్నారు. లడ్డూ కల్తీపై సీబీఐ రిపోర్ట్ ఆధా రంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పు చేసినవారు వేంకటేశ్వరస్వామి శిక్ష నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. రెండు కొండలు అన్న రాజశేఖర్ రెడ్డికి ఎంత శిక్ష పడిందో అందరూ చూశారని ప్రస్తావించారు. దయచేసి లడ్డూ వ్యవహారాన్ని రాజకీయం చేయొద్దని సూచించారు. సిట్ రిపోర్ట్ ఆధారంగా తక్షణమే ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లడ్డూ కల్తీపై అప్పటి పాలకవర్గం నైతిక బాధ్యత వహించాలని, హిందూ సమాజానికి వెంటనే జగన్ అండ్ కో క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిట్ రిపోర్టుపై నమ్మకం లేదని వైసీపీ నేతలు అనడం విడ్డూరంగా ఉందని స్వామి శ్రీనివాసానంద సరస్వతి ఎద్దేవా చేశారు.

# మాజీ మంత్రి అంబటికి మరో షాక్ ఒక దాని వెంట మరొకటి



**అమరావతి, ఫిబ్రవరి 9:**మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత అంబటి రాంబా బుకు మరో షాక్ తగిలింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అంబటి రాంబాబు ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టు ఎదుట హాజరుపర్చగా.. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో అంబటి రాంబాబును రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. అంబటి రాంబాబు ప్రస్తుతం రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అయితే తాజాగా మరో కేసులో అంబటి రాంబాబుకు కోర్టు రిమాండ్ విధించింది. మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై వైసీపీ విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ గతంలో ఆ పార్టీ పలు నిరసనలు కూడా చేసింది.ఈ క్రమంలోనే మాజీ మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలోనూ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. 2025 నవంబర్ 12వ తేదీ అంబటి రాంబాబు నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. అయితే ఆందోళన సందర్భంగా అంబటి రాంబాబు పోలీసులతో దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోప ణలపై గుంటూరులోని పట్టాభిపురం పోలీసులు అంబటి రాంబా బు మీద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ కోసం అంబ టి రాంబాబును రాజమహేంద్రవరం నుంచి పీటీ వారెంట్‌పై గుం టూరు కోర్టుకు తరలించారు. గుంటూరులోని స్పెషల్ జ్యుడీషి యల్ కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారించిన న్యాయమూర్తి అంబటి రాంబాబుకు 14 రోజుల రిమాండ్ విధించారు. మరోవైపు అంబటి రాంబాబు కస్టడీ పిటిషన్ మీద న్యాయస్థానంలో విచారణ జరగనుంది. అనంతరం రాజమండ్రి జైలుకు అంబటి రాంబాబును తరలించే అవకాశాలు ఉన్నాయి. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అంబటి రాంబాబుపై ఇటీవల తెలుగు దేశం శ్రేణులు భగ్గుమన్నాయి. గుంటూరులోని ఆయన నివాసం వద్ద ఆందోళన నిర్వహించాయి. ఈ క్రమంలోనే గుంటూరులోని అంబటి రాంబాబు ఇంటిపైనా, ఆయన వాహనాలపైనా దాడి జరిగింది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనపైనా గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

# వివాహితపై అత్యాచార యత్నం బయటకుచెబితే చంపుతానంటూ బెదిరింపులు



**ఎన్టీఆర్ జిల్లా, ఫిబ్రవరి 9:** ఎన్టీఆర్ జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. తిరువూరు రూరల్ మండలంలోని ఎరుకోపాడు గ్రామంలో ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన సురగం శ్రీనివాసరావు అనే వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటకు చెబితే.. తనతో సహ భర్త, పిల్లలను చంపేస్తానని నిందితుడు బెదిరించాడని బాధితురాలు వాపోయారు. ఈ ఘటనపై.. భర్త ఎరువ బ్రహ్మం, గ్రామపెద్దల సహకారంతో గత బుధవారం తిరువూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారామె.అయితే.. ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు తమకు సరైన న్యాయం జరగలేదని బాధితురాలు ఆవేదన చెందారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు తగిన న్యాయం చేయాలని భర్త డిమాండ్ చేశారు. తిరువూరు పోలీసులు చిన్నపాటి సెక్షన్లు మాత్రమే పెట్టి.. కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై త్వరితగతిన దర్యాప్తు జరిపి, నిందితుడిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, బాధితులు డిమాండ్ చేశారు.

# తిరుమలలో సొంత డెయిరీపై ఆలోచించాలి !




తిరుమల పవిత్రతను కాపాడేందుకు తీసుకునే చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడితే బాగుంటుంది. ఎందుకంటే దాదపు ఏడాదిన్నరగా తిరుమల లడ్డూ కల్తీ చుట్టూనే రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో సిట్ దర్యాప్తు సాగుతోంది. ప్రత్యేక విచారణలు చేపట్టారు. మరో ఏకసభ్య కమిటీ వేస్తున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇక తిరుమల పవిత్రత దెబ్బతినకుండా, రాజకీయాలకు తావు లేకుండా కఠిన చర్యలకు అసవరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దృష్టి పెడితే మంచిది. తిరుమలలో తీసుకునే నిర్ణయాలను ఇప్పుడు ఎవ్వరూ ప్రశ్నించరు. భక్తులకు వసతి పెంచడం, సౌకర్యాలు పెంచడం, శీఘ్రగతిన దర్శనాలు కల్పించడంలో ప్రధాన నిర్ణయాలు జరగాలి. తిరుమలలో సామాన్యులకు సత్వర దర్శనం అన్నది కలగా మారింది. విఐపిల తాకిడి పెరుగుతోంది. స్వామిని దర్శించుకున్న వారే ఇంకా దర్శించుకుంటున్నారు. అలాగే తిరుమలలో ప్లాస్టిక్ నిషేధం జరగాల్సి ఉంది. లడ్డూలను తాటాకు బుట్టల్లో సరఫరా చేస్తామని గతంలో ప్రకటించినా అమల్లోకి రాలేదు. మంచినీటి సమస్యలు రాకుండా చూడాలి. తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటుపై ఆలోచన చేయడం లేదు. ఇకపోతే తెలంగాణ నేతల సిఫార్సులపై వివక్ష ఇంకా కొనసాగుతోంది. ఈ వివక్ష తొలగిపోవాలి. తెలంగాణ నేతలను చిన్నచూపు చూడడం ద్వారా ప్రభుత్వం ఈ ప్రాంతా ప్రజలను అవమానపరుస్తోంది. తిరుమల కొండల్లో పచ్చదనం పెంచాల్సి ఉంది. అడువుల్లో సామాజిక వనాలు పెరగాలి. ఇవన్నీ వదిలేసి ఇంకా కల్తీ నెయ్యి వ్యవహారంతో టిడిపి కూటమి ఒకవైపు, వైకాపా నేతలు మరో వైపు అన్నట్లుగా విమర్శలు, ప్రతివిమర్శలు చేయడం సరికాదు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ ఘటనలు దిగజారుతున్న రాజకీయ విలువలకు పరాకాష్టగా మారాయి. తిరుపతి లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు జోక్యంతో సిబిఐ ఏర్పాటు చేసిన సిట్ నివేదిక బహిరంగ పరచకుండానే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ స్వంత వ్యాఖ్యానాలతో రాజకీయంగా లబ్ది పొందే చర్యలకు దిగారు. లడ్డూ ప్రసాదంలో కొవ్వు అంటూ అధికార కూటమి చేసిన ప్రచారానికి ప్రాయశ్చితంగా యజ్ఞాలు, యాగాలు, పూజలకు వైసిపి నాయకులు తెరతీసారు. దీనికి పోటీగా లడ్డు కల్తీ చేసిన వైసిపి నేతలంటూ అనేక జిల్లాల్లో పేరు, ఊరు లేని బ్యానర్లు వెలిశాయి. పరస్పర విమర్శలతో మొదలై, హద్దులు దాటిన వ్యక్తిగత విమర్శలకు చేరి, దాడులకు, గృహ దహనాల వరకు ఆ వివాదం విస్తరించింది. తిరుపతి లడ్డు కోట్ల మంది ప్రజల విశ్వాసంతో ముడిపడిన సున్నితమైన అంశం. తమ విశ్వాసానికి తగ్గట్టుగా ప్రసాదం పవిత్రంగా వుండాలని కోరుకుంటారు. అలాంటి లడ్డూలో ఆవు కొవ్వు, ఇతర జంతువుల కొవ్వుల లాంటివి కలిశాయని ముఖ్యమంత్రి చెప్పడంతో తక్షణం నిజానిజాలు తేల్చి దోషులకు శిక్ష వేసివుంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ మతానికి అపచారం జరిగిందంటూ కనకదుర్గమ్మ గుడి మెట్లు కడిగారు. ఇలా కాకుండా నిజాలు నిగ్గుతేల్చి దోషులను కోర్టు ముందు నిలబెట్టి ఉంటే బాగుండేది. అన్నింటికి మించి తిరుమల శ్రీవారు కోట్లకు పడగలెత్తారు. ఆయనకు వందలాది గోవులు కూడా ఉన్నాయి. నిజానికి చిత్తశుద్ధి ఉంటే గోశాలలను విస్తరించి, సొంత డెయిరీ ఏర్పాటు చేసివుంటే పేచీ వచ్చేది కాదు. గోశాలలను పెంచి, డెయిరీ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్యా కొంత తీరుతుంది. నెయ్యి కల్తీ సమస్య ఉత్పన్నం కాదు. కల్తీ తీవ్రమైన ఆరోపణ కాబట్టి సంబంధిత అధికార సంస్థల ద్వారా నేరాన్ని నిరూపించి నిందితులకు శిక్షపడేలా చేయడం ప్రభుత్వ బాధ్యత. అందుకోసం నియమించిన సిట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలి. నివేదికలో ఏముందో ప్రకటించకుండానే మరో కమిటీ వేయడంలో అర్థం లేదు. నిజానికి కల్తీ నెయ్యి వ్యవహారం తిరుమల ప్రతిష్టను దెబ్బ తీసేందుకు జరిగిన కుట్ర అనడంలో సందేహం లేదు. హిందూ మతంపై దాడి అని అనడంలోనూ సందేహం లేదు. గతంలో జరిగిన రామతీర్థం, అంతర్వేది, దుర్గ గుడి విగ్రహాల విధ్వంసం, రథాలు కాలిపోవడం లాంటి విషయాలను ప్రస్తావించి ఇదంతా హిందూ మతాన్ని దెబ్బతీసి నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్ర అని పవన్ కళ్యాణ్ ఇప్పటికే ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల చర్యలు అంతిమంగా తమ రాజకీయ పబ్బం గడుపుకునేలా తయారయ్యాయి. ఈ సమస్యలనే ఇక ఇంతటితో ముగించాలి. తిరుమల శ్రీవారికి అవసరమైన ఆవునెయ్యిని పొందేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. తిరుమలలో డెయిరీ ఏర్పాటు చేస్తే మరీమంచిది. శాశ్వతంగా సమస్యకు పరిష్కారం దక్కగలదు. వేలకోట్లు వృధా చేసే బదులు శ్రీవారికి అవసరమైన నెయ్యి, పాలు, వెన్న, మీగడలను పొందేందుకు ఇదే సరైన సమయం. డబ్బులకు కొదవ లేదు. గోవులకు కొదవ లేదు. చంద్రబాబు హెరిటేజ్ నడిపిన అనుభవంతో తిరులమ శ్రీవారి కోసం ఓ మంచి డెయిరీ ఏర్పాటు చేస్తే మంచిది. సుగంధ ద్రవ్యాలను కూడా కొండపై పండించే అవకాశలను పరిశీలించాలి. పూదోటలను విస్తరించాలి. ఆ దిశగా కూటమి నేతలు ఆలోచనలు చేయాలి. సమర్థులైన అధికారులు, బోర్డు ఛైర్మన్, సభ్యులు, ఉన్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. రాజకీయ తాబేదార్లకు బోర్టును అప్పగించినంతకాలం ఇది ఇది సాధ్యం కాదు. ఇకపోతే తిరుమల కల్తీ వ్యవహారాన్ని కోర్టుల తుది తీర్పుకు వదిలేయాలి. అప్పటి వరకు రాజకీయ విమర్శలకు దిగకపోవడం మంచిది.

---

# రాష్ట్ర ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి

- **కేంద్ర నిధులపై ఒత్తిడి పెంచాలి**
- **బలవంతపు భూ సేకరణలు సరికాదు**
- **సిపిఎం నేతల డిమాండ్**



విజయవాడ,ఫిబ్రవరి9: రాష్ట్రంలో కీలకమైన పోలవరం, రాజధాని నిర్మాణం, విశాఖ ఉక్కు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్రం నుండి ఎంత వరకు సాధించారో చెప్పాలని సిపిఎం నేతలు డిమాండ్ చేస్తున్నారు. కొత్త నిధుల మాట పక్కనబెట్టి రాష్ట్రానికి హక్కుగా రావలసిన నిధులే రావడంలేదని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని అంటున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నుండి పన్నుల వాటా రూపంలో రూ. 40,807.28 కోట్లు రావలసి వుండగా, డిసెంబరు వరకు వచ్చింది రూ. 28,846.67 కోట్లు అని, ఇందులో రావలసిన నిధుల్లో 30 శాతం రాలేదని ఆ ఆర్టీ నేతల వి. రాంభూపాల్ అభిప్రాయపడ్డారు. అలాగే గ్రాంట్ల రూపంలో రావలసిన రూ. 32,284.40 కోట్లలో కేవలం రూ. 8,771.67 కోట్లు అంటే 27.17 శాతం మాత్రమే వచ్చాయన్నారు. కేంద్రం నుండి రావలసిన నిధులు పూర్తిగా రాకపోవడం, రాష్ట్ర పారిశ్రామిక, వ్యవసాయ, సేవారంగాల్లో ఆశించిన అభివృద్ధి సాధించలేకపోవడంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రోజురోజుకు అప్పుల్లో కూరుకుపోతోంది. 2025–26 సంవత్సరానికి రూ. 33,185.97 కోట్ల లోటు వుంటుందని బడ్జెట్‌లో అంచనా వేయగా, 2025 డిసెంబర్ నాటికే రూ. 60,480.55 కోట్ల లోటుకు చేరింది. ఈ సంవత్సరం మూడున్నర లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో రాష్ట్రానికి సుమారు నాలుగున్నర వేల కోట్లు తగ్గిపోతాయి. ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్ రాష్ట్రాలకు ఇస్తున్న గ్రాంట్లను రద్దు చేసింది. దీనివల్ల రాష్ట్రానికి మరో రూ. 15 వేల కోట్లు తగ్గిపోతాయని అంచనా ఉందన్నారు. అదనపు నిధులు రాబట్టలేకపోగా, వస్తున్న వాటికే కోతలు పెడుతున్న కేంద్ర బిజెపిని నిలదీయకుండా ఏం చేస్తున్నారని అన్నారు. పారిశ్రామికవేత్తల కోసం కూటమి ప్రభుత్వం లక్షల ఎకరాల భూమిని కేటాయిస్తుంది. లక్షల కోట్ల పెట్టుబడులతో వేల పరిశ్రమలు కోట్ల ఉద్యోగాలు అంటూ పాలకులు ప్రచార హోరెత్తిస్తున్నారు. ఇదే తరహా ప్రచారాన్ని గత ప్రభుత్వం కూడా చేసింది. కంపెనీలకు అతి చౌకగా భూములు అప్పగించడానికి ప్రభుత్వం తహతహ లాడుతున్నది. తొంభై తొమ్మిది పైసలకే ఎకరం ఇవ్వడంపై మంత్రి లోకేష్‌ను విలేకరి ప్రశ్నిస్తే ఉచితంగా కూడా ఇస్తాం, తప్పేంటని గద్దించడం ఈ ప్రభుత్వ స్వభావాన్ని స్పష్టం చేసిందన్నారు. బలవంతపు భూ సేకరణను అనేక ప్రాంతాల్లో ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. ప్రభుత్వం పోలీసుల ద్వారా అణచిపెట్టాలని చూస్తున్నది. ఉద్యమకారుల మీద పి.డి యాక్ట్‌ను కూడా ప్రయోగిస్తున్నది. ఇంత చేసినా పరిశ్రమలు వస్తాయో లేదో అనే సందిగ్ధం పాలకులను వెంటాడుతోందన్నారు. గతంలో చేసుకున్న ఒప్పందాల్లో పది శాతం కూడా అమలులోకి రాలేదు. ప్రజల కొనుగోలుశక్తి పెరగకుండా పెట్టుబడులు రావు, అలాంటి దిశగా ప్రభుత్వ విధానాలు అమలు చేయకుండా దానికి విరుద్ధంగా శాంతిభద్రతలకు విఘాతం చర్యలు అభివృద్ధికి ఎలా తోడ్పడుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గడువులు మారుతున్నాయే తప్ప పూర్తి చేసే పరిస్థితి కనిపించడంలేదు. మొదట్లో పునరావాసం సమస్యను పెద్దగా పట్టించుకోని ప్రభుత్వాలు ప్రజాఉద్యమ ఒత్తిడి మేరకు కొన్ని చర్యలు చేపట్టాల్సి వచ్చింది. ఈ సంవత్సరం కేంద్ర బ్జడెట్‌లో కేటాయించిన నిధులను బట్టి మరో పది సంవత్సరాలు గడిచినా పోలవరం పూర్తి అయ్యే అవకాశం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన మొదట్లో బనకచర్ల ప్రాజెక్టు గురించి చాలా హడావుడి చేశారు. ఇప్పుడు దాని ప్రస్తావనే లేకుండా పోయింది. సుమారు వెయ్యి కోట్లు ఖర్చు చేసిన రాయలసీమ ఎత్తిపోతల పథకం కొనసాగుతుందో లేదో చెప్పలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. వెలిగొండతో పాటు అనేక ప్రాజెక్టులు ఏళ్లు గడిచినా పూర్తి కావడంలేదు. వీటి కోసం ఉమ్మడిగా కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి నిధులు సాధించడానికి కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలని ఆయన అన్నారు.

---

# రాజకీయంగా దెబ్బతీసే కుట్ర

- **మహిళతో సంబంధంపై ఆర్జెడి నేత తేజ్‌ప్రతాప్**

**పాట్నా,ఫిబ్రవరి 9:** అనుష్కా యాదవ్ అనే మహిళతో తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు, ఇప్పుడు ఆమెతో తాను కుమార్తెను కన్నట్లు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్పెద్ద కుమారుడు, ఆర్జేడీ బహిష్కృత నాయకుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తెలిపారు. ఆర్జేడీ నేతలు తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అనుష్కా యాదవ్ అనే మహిళతో తనకు సంబంధాలు ఉన్నట్లు వస్తున్న వార్తలపై తేజ్ ప్రతాప్ అభ్యంతరం తెలిపారు. ఆధారరహితంగా వదంతులు వ్యాప్తి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కుట్ర వెనక మహువా నియోజకవర్గ ఆర్జేడీ ఎమ్మెల్యే ముఖేశ్ రోషన్ ఉన్నాడన్నారు. తన సోదరుడు తేజస్వీ యాదవ్‌కు సన్నిహితులైన పలువురు ఆర్జేడీ నేతలు తన రాజకీయ జీవితాన్ని దెబ్బతీయడానికి కుట్ర పన్నుతున్నారని చెప్పారు. అందులో భాగంగానే ఓ మహిళతో తనకు అక్రమ సంబంధం ఉన్నట్లు తప్పుడు వార్తలు సృష్టించి పార్టీ నుంచి బహిష్కరించేలా చేశారని తేజ్ ప్రతాప్ ఆరోపించారు. ఇప్పుడు ఆ మహిళకు కుమార్తె పుట్టినట్లు వస్తున్న వార్తలు తనను తీవ్ర వేదనకు గురి చేస్తున్నాయన్నారు. ఈ విషయంపై కోర్టుకు వెళ్తానని తెలిపారు. తేజ్ ప్రతాప్ 2018లో బీహార్ మాజీ ముఖ్యమంత్రి దరోగా రాయ్ మనవరాలు ఐశ్వర్యను వివాహం చేసుకున్నారు.అయితే వీరి మధ్య విభేదాలు రావడంతో కొన్నేళ్లుగా విడిగా ఉంటున్నారు. ఇటీవల జరిగిన బీహార్ ఎన్నికల సమయంలో తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో ఆయన ఒక మహిళతో ఉన్న ఫొటో ప్రత్యక్షమైంది. ఆమె పేరు అనుష్క యాదవ్ అని, గత 12 ఏళ్లుగా తాము రిలేషన్‌లో ఉన్నట్లు ఆ పోస్టులో ఉండడంతో అది అప్పట్లో వైరల్‌గా మారింది. దీనిపై తేజ్‌ప్రతాప్ స్పందిస్తూ.. ఎవరో తన సోషల్ మీడియా ఖాతాను హ్యాక్ చేశారని అన్నారు. ఆ పోస్టులోని ఫొటో సైతం ఎడిట్ చేసినదేనని చెప్పారు. ఈ క్రమంలో ఇప్పుడు వారికి కుమార్తె పుట్టినట్లు వార్తలు రావడం గమనార్హం.




---

# భారీ ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ గుట్టు రట్టు

- **రూ. 5,000 కోట్ల దందాను పసిగట్టిన జిఎస్టీ ఇంటిలిజెన్స్**



**హైదరాబాద్,ఫిబ్రవరి9:** హైదరాబాద్‌లో భారీ ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ గుట్టు రట్టు అయ్యింది. ఫినటెక్ ముసుగులో రూ. 5,000 కోట్ల దందాను డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ పట్టుకుంది. ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో డొల్ల కంపెనీలతో కోట్లాది రూపాయల మళ్లింపు చేస్తున్నట్లు డీజీజీఐ గుర్తించింది. 5 వేల కోట్ల రూపాయలు టాక్స్ ఎగ్గొట్టి దుబాయ్‌కి మళ్లించినట్లు తేలింది. టెక్నాలజీని వాడిన హైదరాబాద్ వాసులు బ్యాంకులకే టోకరా వేశారు. ఓటీపీ లేకుండానే 5 వేల కోట్లు నిధుల బదలాయింపు జరిపారు. దుబాయ్ కేంద్రంగా 'మాస్టర్ మైండ్' కొనసాగింది.. హైదరాబాద్‌లో తీగ లాగితే కదిలిన డొంక కదిలింది.నిబంధనలకు విరుద్ధంగా రియల్ మనీ గేమింగ్.. జీఎస్టీ ఎగ్గొట్టేందుకు ఎస్క్రో ఖాతాల వినియోగించినట్లు డీజీజీఐ తెలిపింది. ఓషియానిక్ వెబ్ సొల్యూషన్స్, వెబ్‌విన్ సొల్యూషన్స్ అనే నకిలీ కంపెనీల ద్వారా నిధుల మళ్లించారు. వెబ్‌సైట్ల ద్వారా అక్రమ దందా సాగింది. బ్యాంకింగ్ వ్యవహారాలను దుర్వినియోగం చేసి, ఆడిట్‌కు దొరక్కుండా జాగ్రత్తపడ్డారు కేటుగాళ్లు. 'విగోఫిన్' డైరెక్టర్లు ప్రభు కుమార్, రాజశేఖర్ రెడ్డిలపై అధికారుల నిఘా పెట్టారు. ప్రధాన నిందితుడు దుబాయ్ నుంచి ఈ నెట్‌వర్క్‌ను నడిపిస్తున్నట్లు గుర్తించారు.

# బడ్జెట్ భారత్ కోసమా అమెరికా కోసమా : అఖిలేశ్ యాదవ్ విమర్శలు



న్యూఢిల్లీ:భారత్– అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం విషయంలో కేంద్రంపై సమాజ్?వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం భారత్ మార్కెట్‌ను కేంద్రం అమెరికాకు అప్పగించిందని, అలాగే 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తిని వదిలేసిందని ఆరోపించారు. ఓ వార్త సంస్థతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు'బీజేపీ ప్రాథమిక ఆర్థిక అంశాలపై చర్చించాలనుకోవడం లేదు. మీరు(బీజేపీ) అమెరికాకు 500 బిలియన్ల డాలర్ల విలువైన భారత్? మార్కెట్?ను అప్పగించారు. మీ 'మేక్ ఇన్ ఇండియా' సింహం తుప్పు పట్టిపోయింది. ఇది వీర్ సావర్కర్‌పై చర్చించే సమయం కాదు. అలా చేస్తే చరిత్రలోని అనేక పేజీలు తిరగేయాలి. ఇక ఈ బడ్జెట్ అమెరికా కోసం చేసారా? లేదా భారత్? కోసం రూపొందించారా? ప్రతి విమానాశ్రయంలో మీరు చిరుధాన్యాల ప్రకటనలు పెడుతున్నారు. కానీ అదే సమయంలో వాటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. మనం మన జంతువులకు కూడా తిండి పెట్టలేమా?' అని అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించారు.పశుగ్రాసం దిగుమతులపై ఆందోళనపశుగ్రాసం దిగుమతుల వల్ల స్థానిక పరిశోధనా సంస్థలు, గ్రామీణ జీవనోపాధి దెబ్బతింటోందని అఖిలేశ్ విమర్శించారు. 'ఝాన్సీలో గ్రాస్‌ల్యాం డ్ అండ్ ఫోడర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఉంది. పశువుల పాల ఉత్పత్తి పెరగడానికి, నాణ్యత మెరుగుపడటానికి, కొవ్వు శాతాన్ని పెంచడానికి ఏ మేత మంచిదో పరిశోధన చేయడం వారి పని. కానీ మీరు పశుగ్రాసాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకుని ఆ ప్రయత్నాన్ని నాశనం చేస్తున్నారు. దీని వల్ల పాడి పరిశ్రమలో ఉన్న వెనుకబడిన వర్గాలు, దళితులపై ప్రభావం పడుతుంది. బీజేపీ నాయకుల్లో ఎవరూ పాలు ఉత్పత్తి చేయరు. అంతా వెనుకబడిన వర్గాలు, దళితులే చేస్తారు. బీజేపీ నేతలు పెద్ద భూస్వాములు. అందుకే ముందు మార్కెట్‌ను చైనాకు ఇచ్చారు, ఇప్పుడు అమెరికాకు ఇచ్చారు' అని అఖిలేశ్ యాదవ్ అన్నారు.

# వితంలో ఏదీ సులువుగా ఉండదు పరీక్షా పే చర్చలో విద్యార్థులతో మోదీ



న్యూఢిల్లీ: సాంకేతికత మనం పనిచేసే విధానాన్ని మారుస్తుందని, దాన్ని అర్థం చేసుకుని అవసరానికి తగినట్లుగా వినియోగించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అంతేగానీ సాంకేతికతే మిమ్మల్ని బానిసలుగా మార్చుకునే పరిస్థితికి వెళ్లొద్దని సూచించారు. 'పరీక్షా పే చర్చ రెండో ఎడిషన్‌లో భాగంగా పలువురు విద్యార్థులతో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా కెరీర్ పురోగతికి సంబంధించి వారికి విలువైన సూచనలు చేశారు. విద్యార్థులు వెలిబుచ్చిన సందేహాలకు సమధానాలు ఇచ్చారు. క్రమశిక్షణ, ప్రేరణ ఈ రెండింటిలో ఏది ముఖ్యం..? అన్న ప్రశ్నకు.. ఆ రెండింటినీ పోల్చకూడదని అన్నారు. ఎంత స్ఫూర్తి పొందినా ఆచరణలో క్రమశిక్షణ లేకపోతే సత్ఫలితాలు పొందలేరని అన్నారు. సమయపాలన, స్థిరత్వం, స్వీయ క్రమశిక్షణే మన ప్రేరణను అర్థవంతమైన ఫలితాలుగా మారుస్తుందని చెప్పారు. ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలు నిజమేనా..? అన్న ప్రశ్నకు సాంకేతికత మన పనితీరును మెరుగుపరుస్తుందని చెప్పారు. దాన్ని సరిగ్గా వినియోగించుకుంటే ఏఐకి విద్యార్థులు భయపడాల్సిన పనిలేదన్నారు. టెక్నాలజీతో ఎలా పనిచేయాలన్నది నేర్చుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. జీవితంలో ఏదీ సులువుగా ఉండదన్నారు. విద్యార్థులకు ఐదు ట్రావెల్ డెస్టినేషన్స్ చెప్పండి..? అని అడుగగా.. ముందు మన సొంత ప్రాంతాలపై దృష్టిపెట్టాలని చెప్పారు. మన జిల్లా, నగరం, రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన ప్రాంతాల జాబితాను రాసుకోవాలన్నారు. ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాలో ఎంచుకోవాలని చెప్పారు. అనంతరం మన సమీపంలో ఉన్న ప్రాంతాల విశిష్టతను తెలుసుకుంటే, అది భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. మంచి నాయకుడిగా ఎలా మారాలి..? అన్న ప్రశ్నకు మన విధివిధానాలకు ఎన్నటికీ భయపడకూడదని చెప్పారు. విధేయత, నిబద్ధతతో పనిచేయాలన్నారు. నిలకడగా సరైన పని చేయడమే నిజమైన నాయకత్వమని చెప్పారు. లీడర్‌షిప్‌నకు ముఖ్యమైన లక్షణం మీ తెలియజేయగలడమని అన్నారు. మెదడు ఆరోగ్యంగా పనిచేయాలంటే కంటినిండా నిద్రపోవాలని ప్రధాని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు జీవితాన్ని కూడా ఆస్వాదించాలని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసంగా ఉండటం చాలా ముఖ్యమని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని ప్రధాని తెలిపారు.

# వాణిజ్యం ఒప్పందం కాదు- కొనుగోలుదారులు నిర్ణయిస్తారు' – రష్యా చమురు దిగుమతులపై పీయూశ్ గోయల్



న్యూఢిల్లీ:భారత్–అమెరికా మధ్య మధ్యంతర ఒప్పందం కుదిరిన తర్వాత రష్యా చమురు దిగుమతులపై తలెత్తిన సందేహాలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ స్పష్టత ఇచ్చారు. రష్యా చమురు కొనుగోలుపై నిర్ణయాలు పూర్తిగా దేశీయ కొనుగోలుదారులవేనని అన్నారు. భారత్–అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం వల్ల నిర్ణయించవని ఆయన అన్నారు. ఆదివారం ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.'అమెరికా నుంచి క్రూడ్ ఆయిల్, ఎల్ఎన్‌జీ లేదా ఎల్‌పీజీ కొనడం భారత్‌కు వ్యూహాత్మకంగా ప్రయోజనాల ఆధారంగా తీసుకుంటాం. ఎందుకంటే మేం ఇంధన వనరులను వైవిధ్యపరచాల్సిన అవసరం ఉంది. అయితే ఏది కొనాలి, ఎక్కడి నుంచి కొనాలి అనే నిర్ణయాలు పూర్తిగా కొనుగోలుదారులవే. వాణిజ్య ఒప్పందం ఎవరు ఏమి కొనాలి, ఎక్కడి నుంచి కొనాలి అని నిర్ణయించదు' అని పీయూశ్ గోయల్ వివరించారు.'ఆకర్షణీయంగా వాణిజ్య ఒప్పందం'ఇక వాణిజ్య ఒప్పందం వ్యాపార మార్గాన్ని సులభతరం చేస్తుందని పీయూశ్ గోయల్ తెలిపారు. పోటీ దేశాల కంటే ప్రాధాన్యతను కల్పిస్తుందని అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు అన్నీ పోటీలో ముందుండేందుకు ఇచ్చే ప్రాధాన్యత గురించే అని చెప్పారు. సాధారంగా మనకు 18 శాతం పరస్పర సుంకం ఉన్నప్పటికీ, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే తమకు మెరుగైన ప్రాధాన్యం ఉందని అన్నారు. అందుకే ఈ వాణిజ్య ఒప్పందం చాలా ఆకర్షణీయంగా మారిందని గోయల్ చెప్పారు. ఈ ఒప్పందం భారత్ రష్యా చమురు విధానాన్ని ప్రభావితం చేస్తుందా అని ప్రశ్నించగా, దీనిపై విదేశాంగ మంత్రిత్వ శాఖ వ్యాఖ్యానించడం సముచితమని పీయూశ్ గోయల్ అన్నారు. 'వివిధ మంత్రిత్వ శాఖలు విస్తృత అంశాలపై మేమంతా కలిసి పనిచేస్తాం. కానీ వాణిజ్య ఒప్పందంలోని సూక్ష్మాంశాలు, వివరాలు కావాలంటే వ్యవసాయ మంత్రి, గ్రామీణాభివృద్ధి మంత్రి, టెలికాం మంత్రి లేదా విదేశాంగ మంత్రిని అడిగితే వారికి అవి తెలియకపోవచ్చు. వారు నన్ను సూచిస్తారు. అలాగే భౌగోళిక––రాజకీయ అంశాలైతే నేను విదేశాంగ మంత్రికి పంపిస్తా' అని ఆయన తెలిపారు.'అతి పెద్ద సమస్యే కాదు'అంతకుముందు మరో వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రానున్న ఐదేళ్లలో అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్లు విలువైన వస్తు, ఉత్పత్తులను కొనడం అనేది భారత్‌కు సమస్యే కాదని పీయూశ్ గోయల్ స్పష్టం చేశారు. వాస్తవానికి అది చాలా చిన్న సంఖ్య అని, అమెరికాకు రూ.1.81 కోట్ల కోట్ల (2 ట్రిలియన్ డాలర్లు) గిరాకీని అందించే సామర్థ్యం భారత ఆర్థిక వ్యవస్థకు ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఏటా వివిధ ప్రపంచ దేశాల నుంచి రూ.27.17 లక్షల కోట్లు (300 బిలియన్ డాలర్లు) విలువైన వస్తు, ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకుంటోందని తెలిపారు. భారత్ నుంచి ఆయా దేశాలకు వెళ్తున్న ఈ ఆర్డర్ల విలువ రానున్న ఐదేళ్లలో రూ.1.81 కోట్ల కోట్ల (2 ట్రిలియన్ డాలర్లు)కు పెరుగుతుందని తాను అమెరికా వాణిజ్య శాఖ మంత్రి, అధికార వర్గాలకు వివరించానని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ అమెరికా వస్తు, ఉత్పత్తులు సరైన ధరలకు లభిస్తే, ఈ ఆర్డర్లన్నీ దాని వైపుగా మళ్లుతాయని చెప్పానన్నారు. భారత్–అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇరుదేశాలకు ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్యఒప్పందం కోసం ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి ప్రకటనను విడుదల చేశాయి. ఈ ఒప్పందంలో భాగంగా అదనపు మార్కెట్ అవకాశాలను కల్పించడం, మరింత పటిష్టమైన 'సరఫరా' వ్యవస్థను నిర్మించడంపై దృష్టి సారించినట్లు చెప్పాయి. ఈ ఒప్పందంలో భాగంగా భారత ఉత్పత్తులపై ఉన్న 50 శాతం సుంకాన్ని 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అలాగే తమ దేశం నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులకు భారత్ అంగీకరించిందని తెలిపింది.

# లోక్‌సభలో హైడ్రామా స్పీకర్ ఓం బిర్లాపైనే అవిశ్వాస తీర్మానం



న్యూఢిల్లీ:దేశ రాజధానిలో బడ్జెట్ సమావేశాల వేడి రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. లోక్‌సభలో తమ గొంతు నొక్కేస్తున్నారని, ప్రతిపక్ష నేతలకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ.. స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు విపక్ష 'ఇండి యా' కూటమి గట్టిగా యోచిస్తోంది. పార్లమెంటరీ చరిత్రలో స్పీకర్‌పైనే ఇలాంటి తీర్మానం తీసుకురావాలని చూడటం అత్యంత అరుదైన పరిణామం కాగా .. అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు. విపక్షాల ప్రధాన ఆరోపణలు ఇవే..విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సోమవారం ఉదయం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో టీఎంసీ, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ) వంటి ప్రధాన పక్షాలు పాల్గొన్నాయి. అయితే విపక్షాలు స్పీకర్‌పై మండిపడటానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిది రాష్ట్రపతి ప్రసగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడనివ్వకుండా స్పీకర్ అడ్డుకున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అంతేకాకుండా కాంగ్రెస్ ఎంపీలు, మహిళా నేతలను కించపరిచేలా మాట్లాడిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆయన పట్ల పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని చెప్పుకొస్తున్నారు. ప్రతిపక్ష నేత ఖర్గేకు రాజ్యసభలో ప్రసంగించే అవకాశం దక్కక పోవడంతో విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. అటు లోక్ సభలోనూ విపక్షాల నిరసనలతో సభా కార్యకలాపాలు పదేపదే స్తంభిం చాయి. అవిశ్వాస తీర్మానం నిబంధనలు ఏమిటి?రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సి) ప్రకారం స్పీకర్‌ను తొలగించేందుకు తీర్మానం ప్రవేశ పెట్టవచ్చు. దీని కోసం కనీసం 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. లోక్‌సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశ పెట్టాలంటే కనీసం 50 నుంచి 100 మంది ఎంపీల మద్దతు లేదా సంతకాలు అవసరం. ప్రస్తుతం విపక్షాలు ఆ సంతకాల సేకరణలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. దీనిపై కాంగ్రెస్ నేతలు స్పందిస్తూ.. "మా తదుపరి చర్యల కోసం వేచి చూడండి" అంటూ పరోక్షంగా ఈ వార్తను ధృవీకరించారు. ఒకవేళ తీర్మానం అమల్లోకి వస్తే..?ఒకవేళ ఈ తీర్మానం అమల్లోకి వస్తే.. అది బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి నైతిక సంకటంగా మారుతుంది. అయితే లోక్‌సభలో ప్రభుత్వానికి మెజారిటీ ఉన్నందున ఈ తీర్మానం వీగిపోయే అవకాశం ఉన్నప్పటికీ.. రాజకీయంగా స్పీకర్ స్థానాన్ని వివాదాల్లోకి నెట్టడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని విపక్షాలు భావిస్తున్నాయి.

# జిల్లా పరిషత్ ఎన్నికల తర్వాత హోటల్ వద్ద కారులో రెండు ఈవీఎంలు



ముంబై: జిల్లా పరిషత్ ఎన్నికల తర్వాత అర్ధరాత్రి వేళ ఒక హోటల్ వద్ద ఉన్న కారులో రెండు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) కనిపించాయి. దీంతో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే ఓటింగ్‌కు వినియోగించని 'రిజర్వ్' ఈవీఎంలని ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. వీటిని సకాలంలో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించకపోవడంపై చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోలాపూర్‌తో సహా 12 జిల్లా పరిషత్, 125 పంచాయతీలకు ఫిబ్రవరి 7న ఎన్నికలు జరిగాయి.కాగా, పోలింగ్ ముగిసిన తర్వాత శనివారం అర్ధరాత్రి వేళ మోహోల్‌లోని ఒక హోటల్ సమీపంలో ఎన్నికల విధుల్లో ఉన్న అధికారి కోసం అద్దెకు తీసుకున్న కారులో రెండు ఈవీఎంలు కనిపించాయి. దీంతో ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగినట్లు ఎన్సీపీ అభ్యర్థి ఆరోపించారు. దీనిపై విచారణ జరుపాలని డిమాండ్ చేశారు.మరోవైపు ఈ సమాచారం తెలిసిన వెంటనే ఎన్నికల రిటరి ్నంగ్ అధికారి, తహసీల్దార్, పోలీస్ సిబ్బంది ఆ హోటల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఉన్న కారు లోని ఈవీఎంలను తనిఖీ చేశారు. అవి 'రిజర్వ్' ఈవీఎంలు అని, ఓటింగ్ కోసం ఉపయోగించలేదని ఎన్నికల అధికారి తెలిపారు. ఆ రెండు ఈవీఎంలు సీలు వేసిన స్థితిలో ఉన్నా యని చెప్పారు.మహారాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఈ సంఘటనపై స్పందించింది. పోలింగ్ సమయంలో ఎలాంటి అవకతవకలు లేదా అక్రమాలు జరుగలేదని స్పష్టం చేసింది. రిజర్వ్ ఓటింగ్ సకాలంలో జమ చేయడంలో విఫలమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

# ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి భారత్ నిధులందిస్తోందంటూ పాక్ మంత్రి ఆరోపణలు.



ఇస్లామాబాద్ : ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి నెపాన్ని భారత్‌పై నెట్టేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తూనే ఉంది. ఇస్లామాబాద్‌లోని షియా ముస్లింలకు చెందిన ఖదీజతుల్ కుబ్రా మసీదు, ఇమాంబర్గా (అషూర్‌ఖానా)లో గుర్తు తెలియని ఆత్మాహుతి బాంబర్ తనను తాను పేల్చేసుకోవటంతో 69 మంది మరణించారు. 169 మంది గాయపడ్డారు. ఈ దాడి వెనుక భారత్ హస్తం ఉందంటూ వచ్చిన వార్తలను కేంద్రం ఖండించింది. అయినప్పటికీ పాక్ నేతలు మాత్రం భారత్‌పై ఆరోపణలు చేస్తూనే ఉన్నారుతాజాగా పాక్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహసిన్ నఖ్వీ భారత్‌ను నిందిస్తూ ఆరోపణలు చేశారు. తమ దేశంలోని ఉగ్ర సంస్థలకు భారత్ నిధులందిస్తోందని అన్నారు. తాజా దాడిలో ఐసిస్, తాలిబన్ల పేర్లు బయటకు వచ్చాయని, వారికి భారత్ నుంచే నిధులు, లక్ష్యాలు వస్తున్నాయని ఆరోపించారు. మొదట్లో ఒక్కో ఉగ్రవాదికి 500 డాలర్లు వచ్చేవని, ప్రస్తుతం 1500 డాలర్లు అందుతున్నాయని అన్నారు. వారి బడ్జెట్‌ను ఎవరో పెంచుతున్నారని అన్నారు. తాజా దాడిలో అఫ్గాన్ పౌరుడే ప్రధాన సూత్రధారి అని, అతడిని అరెస్ట్ చేశామని నఖ్వీ తెలిపారు ఈ దాడికి బాధ్యత వహిస్తూ వెంటనే ఎవరూ ప్రకటన చేయలేదు అయితే, ఇది తెహ్రీక్ ఏ తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ) పని అయి ఉండొచ్చని పోలీస్ వర్గాలు తెలిపాయి. దాడికి పాల్పడిన వ్యక్తి పాకిస్థాన్ పౌరుడు కాదని పేర్కొన్నాయి. రెండు రోజుల పర్యటన కోసం పాకిస్థాన్‌కు వచ్చిన ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్ ఇస్లామాబాద్‌లో ఉండగానే ఈ దాడి జరగటం సంచలనం సృష్టించింది. ఈ దాడిని భారత్ ఖండించింది.

# గూండారాజ్యాన్ని మేం ఆమోదించం: సీజేఐ



న్యూఢిల్లీ: గూండారాజ్యం ఆమోదయోగ్యం కాదు అని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టులో ఓ న్యాయవాదిపై జరిగిన దాడి కేసులో సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆ న్యాయవాది దాఖలు చేసిన అత్యవసర పిటీషన్ పై సుప్రీంకోర్టు స్పందిస్తూ.. ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఆశ్రయించాలని కోరింది. ఫిబ్రవరి 7వ తేదీన తీస్ హజారీ కోర్టులో నిందితుడి తరపున వాదిస్తున్న లాయర్‌పై మరో వర్గానికి చెందిన లాయర్, అతని మనుషులు కోర్టులోనే దాడి చేశారు. జడ్జీ ముందునేగా ఆ అటాక్ జరిగింది. కోర్టులో అందరు ఉన్నప్పుడే ఈ ఘటన జరిగినట్లు ఆ న్యాయవాది తన పిటీషన్‌లో పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌పై స్పందిస్తూ.. జనవరి 7వ తేదీన జరిగిన ఘటన గురించి ఢిల్లీ హైకోర్టు సీజేకు ఇన్ఫార్మ్ చేశారా అని సుప్రీం ప్రశ్నించింది. ఢిల్లీ హైకోర్టు సీజేకు లేఖ రాసి, ఆ లేఖను తనకు కూడా పంపమని సుప్రీం సీజే అన్నారు. తొలుత హైకోర్టు చీఫ్ జస్టిస్ దీనిపై స్పందించాలన్నారు. అయితే పరిపాలనా విభాగం చర్యలు తీసుకుంటుదని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. ఇలాంటి గుండారాజ్యం తమకు ఆమోదయోగ్యం కాదు అని, అంటే ఇక్కడ చట్టం విఫలమైనట్లే అని పేర్కొన్నది. తమ పరిధిలో ఉన్న హైకోర్టుకు వెళ్లాలని కోర్టు చెప్పింది.

# రష్యా ఇంధనం కొనేందుకు ఇంకా ఆర్డర్ ఇవ్వని భారత రిఫైనరీలు



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన రిఫైనరీ సంస్థలు.. రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను దాదాపు ఆపేసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఓ కథనం ప్రముఖ మీడియా ఏజెన్సీలో ప్రచురితమైంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం సంస్థలతో పాటు అతిపెద్ద రిఫైనరీ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా రష్యా ఇంధనాన్ని కొనుగోలు చేసేందుకు ఆఫర్లు వెల్లడించడం లేదని తెలిసింది. మార్చి, ఏప్రిల్ నెలకు కావాల్సిన ఆయిల్ లోడింగ్‌కు చెందిన ఆర్డర్లు రాలేదని ఆ మీడియా కథనంలో వెల్లడైంది. అయితే ఐఓసీ, బీపీ, రిలయన్స్ సంస్థలు.. మార్చి నెలకు కొంత మేర ఆర్డర్ గతంలోనే చేసుకున్నా.. ఇతర ఇండియన్ కంపెనీలు మాత్రం తమ ఆర్డర్‌ను పూర్తిగా నిలిపివేసినట్లు తెలిసింది. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ట్రేడ్‌డీల్ కుదిరిన నేపథ్యంలో భారతీయ రిఫైనరీలు రష్యా నుంచి చమురును కొనడం ఆపేసిట్లు భావిస్తున్నారు. రష్యా నుంచి ఇంధన దిగుమతులు 38 నెలల కనిష్టానికి పడిపోయాయి. 2025 డిసెంబర్‌లో 2.7 బిలియన్ల డాలర్లు ఉన్నది. ఆయిల్ దిగుమతిపై భారత ప్రభుత్వం నేరుగా ఆదేశాలు ఇవ్వకున్నా.. కంపెనీలు మాత్రం కొత్తగా ఎటువంటి ఆర్డర్ పెట్టలేదని తెలుస్తున్నది.

Edited,Printed,Published and Owend by Mare Chinnababu , Printed at sravanthi prienters , rtc crass road ,Hyderabad-500001. Published at Plat no : 223 , Gajula Ramaram , Road 1, Hyderabad - 500001, Telangana. Editor : Mare Chinnababu , (TGTEL/33/B45017) e-mail : vaarthpatrika@gmail.com , Cell : 9490617567 , 99081 21111,